12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026
ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :265 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | బుధవారం 30 సెప్టెంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :265 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : TIRUPATI | WED 30 SEPTEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

- 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్
- గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి
- రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం
- అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు

- మిగతా 2లో



## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

- ఇటీవల కన్నుమూసిన వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్
- ఒంగోలులో కాకుమాను నివాసానికి వెళ్లిన జగన్
- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా

- మిగతా 2లో

## నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

- విజయవాడలో మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల సదస్సు
- ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఏపీకి దేశంలోనే ప్రథమ స్థానం
- పాలనలో టెక్నాలజీ వాడకం పెరగాలని సీఎం చంద్రబాబు పిలుపు
- నేర్చుకున్న నైపుణ్యాలు సేవల నాణ్యతలో కనిపించాలని స్పష్టీకరణ

- మిగతా 2లో






# పల్లె పండుగ 3.0 ప్రారంభం..
# గ్రామాలకు రూ.11,085 కోట్లు

- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన
- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి
- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

### గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది,"

- మిగతా 2లో

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

### అమెరికాకు జైశంకర్ గట్టి సంకేతం



- ఉగ్రవాదంపై భాగస్వాముల వైఖరి సంబంధాలను ప్రభావితం చేస్తుందన్న జైశంకర్
- తమ ప్రధాన ఆందోళనను అర్థం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా పొరుగు దేశం నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని వెల్లడి
- భారత్-అమెరికా బంధానికి వాణిజ్య విభేదాలతో పాటు ఉగ్రవాదం కూడా సవాల్ అని వ్యాఖ్య

- మిగతా 2లో



## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

పెన్ పవర్ డెస్క్: ప్రతిపక్ష ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై చెప్పింది. ఇకపై ఇండియా కూటమిలో తాము భాగం కాదని తెలిపింది. కాంగ్రెస్‌?తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 30న కాంగ్రెస్ అధ్యక్షతన జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

- మిగతా 2లో

## ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు



- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో సింగపూర్ హోం మంత్రి షణ్ముగం భేటీ
- రాష్ట్రంలో విద్యా సంస్కరణలను ప్రశంసించిన సింగపూర్ మంత్రి
- మాదకద్రవ్యాల నియంత్రణ, విద్యారంగంలో ఏపీకి సహకారం అందిస్తామని హామీ
- ఏపీ ఐటీఐలను సింగపూర్ ఐటీఈతో అనుసంధానించాలని నిర్ణయం
- డ్రాపౌట్లను సున్నా శాతానికి తగ్గించాలని షణ్ముగం సూచన

- మిగతా 2లో

## నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్




- జమ్మూకశ్మీర్‌లోని కతువా జిల్లాలో సీఐఎస్ఎఫ్ క్యాంపులో దారుణం
- సహోద్యోగులపై కాల్పులు జరిపిన హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్
- అసిస్టెంట్ కమాండెంట్ సహా నలుగురు సిబ్బంది అక్కడికక్కడే మృతి
- వాగ్వాదమే కాల్పులకు కారణమని ప్రాథమిక సమాచారం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు.. సీఐఎస్ఎఫ్ ఉన్నతస్థాయి విచారణ

- మిగతా 2లో

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను

- మిగతా 2లో

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి



పెన్ పవర్ డెస్క్:మాస్కో: రష్యాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. శిక్షణ సమయంలో రష్యా సైనిక విమానం (Tu-95 బాంబర్) కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా మరొకరు గాయపడ్డారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తూర్పు అమూర్

- మిగతా 2లో

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

- ఎన్నికల ప్రక్రియలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్
- 13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు
- పార్లమెంటు, కోర్టులు, వీధుల్లో పోరాడతామని కాంగ్రెస్ ప్రకటన

- మిగతా 2లో





## అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

- చివరి వ్యక్తి సంక్షేమమే అభివృద్ధికి గీటురాయి అన్న భగవత్
- అభివృద్ధిలో అంతరాలు వీలైనంత తగ్గించాలని సూచన
- ప్రకృతిని కాపాడుకుంటూనే ప్రగతి సాధించాలి
- అభివృద్ధి బాధ్యత సమాజం కూడా తీసుకోవాలని పిలుపు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

దేశాభివృద్ధిలో రాబోయే రెండు దశాబ్దాలు అత్యంత కీలకమని, ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలనా వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన "మిషన్ కర్మయోగి" దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ప్రకటించిన పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి స్వీకరించారు. ఈ విభాగంలో కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి అవార్డులను అందుకున్నాయి. శిక్షణ అంటే కేవలం ధ్రువపత్రాలు పొందడం మాత్రమే కాదని, నేర్చుకున్న నైపుణ్యాలు ప్రజలకు అందే సేవల నాణ్యతలో ప్రతిబింబించాలని సీఎం పేర్కొన్నారు. "ఒక రెవెన్యూ అధికారి సమస్యను వేగంగా పరిష్కరించడం, ఉపాధ్యాయుడు మెరుగ్గా బోధించడం వంటి సానుకూల మార్పులే శిక్షణకు అసలైన గీటురాయి" అని ఆయన వివరించారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇంకా పాత నిబంధనలు, అనవసరమైన పేపర్‌వర్క్‌ను కొనసాగించడం సరికాదని, పాలనా ప్రక్రియలను సమూలంగా సంస్కరించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియాలో సమయాన్ని వెచ్చించే బదులు, 'ఐగాట్-మిషన్ కర్మయోగి' వేదిక ద్వారా తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కేవలం నియంత్రణ వ్యవస్థగా కాకుండా, ప్రజలను సాధికారత దిశగా నడిపించేదిగా ఉండాలని, తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పలు దక్షిణాది రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

- మొదటి పేజి తరువాయి

డీఎంకే ప్రతినిధి టి.కె.ఎస్. ఇలంగోవన్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఇకపై డీఎంకే భాగం కాదని తెలిపారు. కాంగ్రెస్ తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30న జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి కూడా డీఎంకే హాజరు కాదని ఆయన తేల్చిచెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ తమతో బంధాన్ని తెంచుకుని అధికార టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చి మాకు ద్రోహం చేసిందని విమర్శించారు. కేవలం రెండు పదవుల కోసం ఆశపడి కాంగ్రెస్ డీఎంకేకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. కాంగ్రెస్ తీరుతో ఇండియా కూటమిలోని ఇతర పార్టీలు కూడా అసంతృప్తితో ఉన్నాయని.. సమావేశానికి వెళ్లేందుకు ఆ పార్టీలు కూడా విముఖత వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. అయితే, బీజేపీపై వ్యతిరేకత విషయంలో ఇండియా కూటమిలోని పార్టీలు భావజాలపరంగా ఐక్యంగానే ఉన్నాయని చెప్పారు. ఇండియా కూటమి సమావేశానికి హాజరుకానంత మాత్రాన ఎన్డీఏకు మద్దతు ఇస్తున్నట్లు కాదని పేర్కొన్నారు.

### ఇండియా కూటమి కీలక సమావేశం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విషయంలో ఈసీలో భేదాభిప్రాయాలు ఉన్నాయన్న వార్తలు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలనే డిమాండ్‌తో పాటు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై చర్చించేందుకు సెప్టెంబర్ 30న ఇండియా కూటమి సమావేశానికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో డీఎంకే ఇండియా కూటమి నుంచి వైదొలగడంతో పాటు సమావేశానికి కూడా హాజరు కావడం లేదని తెలిపింది. ఇక, ముందస్తు షెడ్యూల్ కారణంగా యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదు. సమాజ్ వాదీ పార్టీ తరుపున సీనియర్ నేత ఈ సమావేశానికి హాజరు కానున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- మొదటి పేజి తరువాయి

గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి

- మొదటి పేజి తరువాయి

ప్రాంతంలోని క్రాస్నోయరోవో గ్రామానికి సమీపంలో మంగళవారం (సెప్టెంబర్ 29) ఈ ప్రమాదం జరిగింది. సాంకేతిక కారణాలతో టేకాఫ్ అయిన కాసేపటికే విమానం కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో మొత్తం ఏడుగురు ఉన్నారు. ఇందులో ఆరుగురు మరణించగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జనవాసాలు లేని ప్రదేశంలో విమానం కుప్పకూలడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణం ఏంటన్నది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఫ్లైట్ క్రాష్?కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఈ వీడియోలో.. కుప్పకూలగానే విమానం ఇంధనం ట్యాంకులు పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగడం కనిపించింది.

# పల్లె పండుగ 3.0 ప్రారంభం.. గ్రామాలకు రూ.11,085 కోట్లు

- మొదటి పేజి తరువాయి

అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

### పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

### ఉదయగిరికి వరాల జల్లు

ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.

65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు.

90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 భూసేకరణకు రూ.85 కోట్లు.

రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు.

కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు.

వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

### సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు

ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వినూత్న సంస్కరణలను సింగపూర్ ప్రభుత్వం ప్రశంసించింది. రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని సింగపూర్ హోం, న్యాయశాఖల మంత్రి కె. షణ్ముగం హామీ ఇచ్చారు. మంగళవారం తిరుమలలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆయన భేటీ అయ్యారు. శ్రీవారి దర్శనం అనంతరం ఇరువురు నేతలు రాష్ట్ర అభివృద్ధి, విద్యా సంస్కరణలు, మాదకద్రవ్యాల నివారణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, ముఖ్యంగా విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పనితీరుతో పాటు విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి షణ్ముగం ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును సున్నా శాతానికి తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి షణ్ముగం సూచించారు. బడి మానేసే పిల్లలే భవిష్యత్తులో మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సింగపూర్ తరహా కఠిన చట్టాలు అవసరమని అభిప్రాయపడుతూ, డ్రగ్స్ రహిత ఏపీ నిర్మాణానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న తీరును మంత్రి లోకేశ్ వివరించగా, ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా సందర్శించేందుకు మంత్రి షణ్ముగం ఆసక్తి వ్యక్తం చేశారు. అలాగే, యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో ఏపీలోని ఐటీఐలను సింగపూర్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఐటీఈ)తో అనుసంధానించేందుకు పరస్పరం సహకరించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

# చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

### గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కళ్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

### రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0'

'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

### ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కళ్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

### అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు.

రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కళ్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు. 'కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం' చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా 'అందరికీ మేలు' జరగాలని భగవత్ ఆకాంక్షించారు. ఏ నిర్ణయం తీసుకున్నా సమాజంలోని అత్యంత నిరుపేద వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించి, వారు గౌరవప్రదంగా జీవించేలా చూడటమే నిజమైన అభివృద్ధి అని ఆయన వివరించారు. రైతులు రుణాల ఊబిలో కూరుకుపోకుండా సేంద్రియ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, విత్తనాలు, ఎరువుల విషయంలో స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. ప్రగతి పేరిట ప్రకృతిని విధ్వంసం చేయకూడదని హితవు పలికారు. అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, సమాజం కూడా తన వంతు పాత్ర పోషించాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.

# ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు.

దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరపున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

భారత్-అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయన దుయ్యబట్టారు. "అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్

జమ్మూకశ్మీర్‌లో తీవ్ర విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)కు చెందిన ఒక జవాన్ తన సహోద్యోగులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక ఉన్నతాధికారి కూడా ఉన్నారు. కతువా జిల్లాలోని సేవా-2 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కతువా జిల్లాలోని బసోహ్లి ప్రాంతంలో ఉన్న సేవా-2 హైడల్ పవర్ ప్రాజెక్టుకు సీఐఎస్ఎఫ్ సిబ్బంది భద్రత కల్పిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో డ్యూటీ మార్పు జరుగుతుండగా, హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్ అనే జవాన్‌కు, ఇతర సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన అవధేశ్ సింగ్, తన వద్ద ఉన్న తుపాకీతో సహోద్యోగులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో అసిస్టెంట్ కమాండెంట్ అంకిత్ కుమార్ పాండే, సబ్-ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సింగ్, కానిస్టేబుళ్లు రఫిక్ అహ్మద్, సందీప్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సంఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన ఇతర సిబ్బంది, నిందితుడు అవధేశ్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని, కతువా పోలీసులకు అప్పగించారు. కతువా ఎస్ఎస్‌పి మోహితా శర్మ ఈ ఘటనను ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు ఉన్నతస్థాయి విచారణకు (కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ) ఆదేశించింది. సీఐఎస్ఎఫ్ డీజీ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేవలం చిన్న వాగ్వాదమే ఈ దారుణానికి కారణమా లేక మరేదైనా నేపథ్యం ఉందా అనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. ఒకే దళానికి చెందిన సిబ్బంది మధ్య జరిగిన ఈ కాల్పుల ఘటన (ఫ్రాట్రిసైడ్) తీవ్ర కలకలం రేపింది.

# వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

కాగా, విజయవాడలో సెప్టెంబర్ 21న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ చేపట్టిన నిరసనలో జరిగిన తోపులాట అనంతరం రాజశేఖర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. రాజశేఖర్ గతంలో లిడ్?క్యాప్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

# పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం.. శ్రీకాళహస్తీశ్వరుడి తీర్థప్రసాదాలు అందజేత





**తిరుపతి విమానాశ్రయంలో ఉపముఖ్యమంత్రిని కలిసిన దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఈవో బి.కె. వెంకటేశ్వర్లు**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

నెల్లూరు పర్యటన నిమిత్తం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, దేవస్థానం ఈవో బి.కె. వెంకటేశ్వర్లు పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా అభినందించారు.

**స్వామివారి తీర్థప్రసాదాలు సమర్పణ**

శ్రీకాళహస్తీశ్వర స్వామివారి తీర్థప్రసాదాలను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అందజేసి, స్వామివారి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి క్షేత్ర విశిష్టత, ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక చర్చ

శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, దర్శన ఏర్పాట్లు, భవిష్యత్తులో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఈవో బి.కె. వెంకటేశ్వర్లు పవన్ కళ్యాణ్‌కు వివరించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చేపడుతున్న చర్యలను తెలియజేశారు.

స్థానిక రాజకీయ పరిణామాలపై ఆరా

అదేవిధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యకలాపాలు, పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలు, స్థానికంగా చోటుచేసుకుంటున్న పలు పరిణామాలపై కూడా పవన్ కళ్యాణ్‌తో చర్చించారు. నియోజకవర్గంలోని పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై ఉపముఖ్యమంత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు, పార్టీ కార్యక్రమాలు, స్థానిక అంశాలపై జరిగిన ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఈవో బి.కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పల్లె పండుగ 3.0తో గ్రామాల అభివృద్ధికి బాటలు

## ఏర్పేడు మండలంలో రూ.48.11 లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ నూతన బస్‌షెల్టర్ ప్రారంభం

**ఏర్పేడు, పెన్ పవర్ ,సెప్టెంబర్ 29:**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "పల్లె పండుగ 3.0" కార్యక్రమంలో భాగంగా ఏర్పేడు మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

విబి – జిఆర్ఏఎంజి నిధులతో పాగాలి గ్రామంలో రూ.27 లక్షలు, కాట్రకాయలగుంటలో రూ.4.44 లక్షలు, నచ్చునేరి గ్రామంలో రూ.16.67 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. మొత్తం రూ.48.11 లక్షల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



అదేవిధంగా ఏర్పేడువెంకటగిరి బైపాస్ రోడ్డులో నిర్మించిన నూతన బస్‌షెల్టర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రజల రాకపోకలకు, ప్రయాణికుల సౌకర్యానికి బస్‌షెల్టర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం మండల టీడీపీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, శివశంకర్ రెడ్డి, నైనూరు పున్నారావు, సూరి నాయుడు, మోహన్ నాయుడు, సుధాకర్ రెడ్డి, మురుగన్, యూనిట్ ఇన్‌చార్జి రాఘవేంద్ర, బత్తల గిరి నాయుడు, గాలి కృష్ణవేణి, గుణా యాదవ్, చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఇన్‌చార్జీలు కేశినేని సుబ్రమణ్యం, బాబు నాయుడు, రాచేటి సుబ్రమణ్యం, సీతాపతి ఆచారి,పిఏసిఎస్ చైర్మన్ మహేష్ రెడ్డి, పార్థసారథి, మునిరెడ్డి, రాజా, చంద్ర, వెంకటరమణ, బాలకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, కేకే రమణ, హరిరెడ్డి, సురేష్, వెంకయ్య, జగదీష్, నారాయణ, రామదాసు తదితర అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు.

# స్వర్ణాంధ్రకు గ్రామాలే పునాది : సీఎం చంద్రబాబు నాయుడు....





**పెన్ పవర్ సెప్టెంబర్ 29 నెల్లూరు జిల్లా బ్యూరో**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, స్వర్ణాంధ్ర సాధనకు గ్రామాలే పునాది అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో నిర్వహించిన 'పల్లె పండుగ' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని, పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్ది ఆర్థిక అసమానతలు తొలగించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో భాగంగా గోకులం షెడ్లు, మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నామని, ప్రతి ఒక్కరికీ ఇల్లు, ఇంటి స్థలం, విద్యుత్, సోలార్ ప్యానెళ్లు సమకూర్చేలా విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి గత పాలకులు రూ. 10 లక్షల కోట్ల అప్పులతో ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై ఉంచారని చంద్రబాబు విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో, ప్రధాని నరేంద్ర మోదీ అండతో రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన మంత్రమని ఉద్ఘాటించారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా 'సూపర్ సిక్స్' హామీలను విజయవంతంగా అమలు చేస్తున్నామని, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'స్త్రీ శక్తి' కింద ఉచిత బస్సు ప్రయాణాలు, పిల్లలందరికీ 'తల్లికి వందనం', రైతులకు 'అన్నదాత సుఖీభవ' వంటి సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తున్నామని గుర్తుచేశారు. ఒకటో తేదీనే సామాజిక పెన్షన్ల పంపిణీతో పాటు పేదల ఆకలి తీర్చేందుకు రూ. 5కే అన్నా క్యాంటీన్లను తిరిగి తెచ్చామని, మత్స్యకారులు, నేతన్నలు, ఆటో డ్రైవర్ల సేవలో ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు అమూల్ తరహాలో 'స్వయం' బ్రాండ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వికేంద్రీకరిస్తూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి మారినట్లు చంద్రబాబు తెలిపారు. గతంలో పారిశ్రామికవేత్తలను తరిమేసి దెబ్బతీసిన ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించామని, ప్రస్తుతం రాష్ట్రానికి భారీ పరిశ్రమలు తరలివస్తున్నాయన్నారు. కృష్ణపట్నంరామాయపట్నం రేవుల మధ్య దగదర్తి విమానాశ్రయం నిర్మించి నెల్లూరు, ప్రకాశం జిల్లాలను భారీ లాజిస్టిక్స్ హబ్‌గా మారుస్తామని, రూ. లక్ష కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ ప్లాంట్ రానుండటంతో పాటు రక్షణ రంగ పరిశ్రమలు ఇక్కడ కొలువుదీరనున్నాయని వెల్లడించారు. 30 ఏళ్ల క్రితం తానే శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును రూ. 4 వేల కోట్ల పనులు పెండింగులో ఉండగానే గత ప్రభుత్వం మొక్కుబడిగా ప్రారంభించి మోసం చేసిందని మండిపడ్డారు. వెలిగొండ ఫేజ్-2 పనులను శరవేగంగా పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గానికి సాగునీరు అందించి, మార్కాపురం ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసా ఇచ్చారు. హంద్రీ-నీవా, పోలవరం ఎడమ కాలువ ద్వారా తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.

ఇదే వేదికపై నుంచి ఉదయగిరి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి భారీ వరాలు ప్రకటించారు. పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్ కాలువ పనులకు రూ. 52 కోట్లు, సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 పనులకు రూ. 85 కోట్లు కేటాయించడంతో పాటు సోమశిల డ్యామ్ భద్రతకు నిధులిస్తామని హామీ ఇచ్చారు. కనిగిరి పరిధిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల్లో తాగునీటి సరఫరాకు రూ. 100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా ఓలేటివారిపాలెం, గూడూరు, లింగసముద్రం మండలాల్లో తాగునీటి ఎద్దడిని తీరుస్తామని, కనిగిరి-బల్లిపల్లె వద్ద ట్రిపుల్ ఐటీ (×××) ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. కనిగిరిలో బీటీ రోడ్ల నిర్మాణం, రాజవోలు ఎత్తిపోతల పనులను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు.

తాము ప్రజలకు సేవకులం మాత్రమేనని, పెత్తందార్లం కాదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి, నాటి విధ్వంసానికినేటి వికాసానికి గల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. తాము పేదలకు సంక్షేమ పట్టాభిషేకం చేస్తుంటే, కొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేయాలని చూస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడితే ఎంతమాత్రం ఉపేక్షించబోమనిహెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడిన నెల్లూరు, ఉదయగిరి ప్రాంత వాసులు స్థానిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# బుచ్చి నుండి పల్లె పండుగ 3.శీ కు భారీగా తరలి వెళ్లిన కూటమి నాయకులు

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 29.**

నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో మంగళవారం ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగ 3.0 లో అభివృద్ధి కార్యక్రమాలపై భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ఈ సభకు బుచ్చిరెడ్డిపాలెం పట్టణం నుండి మహిళలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జ్ వింజం రామానాయుడు, ఒవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, టిడిపి నాయకులు నెల్లూరు ప్రభాకర్ రెడ్డి, దొడ్ల కోదండరామిరెడ్డి, కౌన్సిలర్ మల్లారెడ్డి తదితరులుజండా ఊపి బస్సును ప్రారంభించారు.



పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# పల్లె పండుగ మహాసభకు చేజర్ల నుంచి భారీ తరలింపు

## టీడీపీ శ్రేణుల బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి మాసారపు సుబ్బయ్య

**శ్రీకాళహస్తి ,పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

ఉదయగిరి నియోజకవర్గం రామాపురం వద్ద మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్న 'పల్లె పండుగ3.0' అభివృద్ధి కార్యక్రమాల దిగ్విజయ మహాసభకు చేజర్ల మండలం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు చేజర్ల మండల టీడీపీ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి జయంతుల నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో పార్టీ శ్రేణులు సభకు బయలుదేరారు.



ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, చేజర్ల మండల స్పెషల్ అబ్జర్వర్ మాసారపు సుబ్బయ్య బస్సులకు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వన్నె కులక్షత్రియ డైరెక్టర్ మిన్నల రవితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన



జరిగే మహాసభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో చేజర్ల మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలివెళ్లారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ మహాసభ వేదికగా నిలవనుందని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలపై బీజేపీ కసరత్తు

## అభ్యర్థుల ఎంపికపై అత్యవసర సమావేశం.. గెలుపే లక్ష్యంగా వ్యూహరచన





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

త్వరలో జరగనున్న శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ముమ్మరం చేసింది. బీజేపీ రాష్ట్ర కమిటీ సూచనల మేరకు మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపికపై రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిధ వార్డుల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశావహుల వివరాలు, వారి ప్రజాదరణ, స్థానికంగా పార్టీకి ఉన్న బలం, వార్డుల వారీగా రాజకీయ పరిస్థితులు తదితర అంశాలపై ముఖ్య నేతలతో కోలా ఆనంద్ సమగ్రంగా సమీక్షించారు. అభ్యర్థుల ఎంపికలో పార్టీ విజయావకాశాలకు అనుగుణంగా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని నేతలు చర్చించారు.

కూటమి సమన్వయంతో ముందుకు..

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి భాగస్వామ్య పార్టీలతో సీట్ల సర్దుబాటు, సమన్వయంతో ఎన్నికల బరిలోకి దిగేందుకు పార్టీ నాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కోలా ఆనంద్ తెలిపారు. క్షేత్రస్థాయిలో మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని సూచించారు.

మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో పార్టీ పరిస్థితిని అంచనా వేసి, ప్రజా సమస్యలను తెలుసుకుని సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేయడంతో పాటు ఎన్నికల ప్రచారాన్ని పటిష్టంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కంద్రిగ ఉమా, జిల్లా మాజీ అధ్యక్షులు చంద్రప్ప, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు రాఘవనాయుడుకుప్పం హరీష్ రెడ్డి, ముఖ్య నేతలు కునాటి నాగరాజు, చాగాణం శైలజ, రామ్ ఉమాసింగ్, కోనేటి అయ్యప్ప, చిలకా రంగయ్య, గరిపాటి రమేష్, ఇరబోయిన లోకేష్, జీవీ అమర్నాథ్, సొట్ట సుకుమార్, కన్నా వెంకటేశ్వర్లు, మద్దు వాసుయాదవ్, పుణ్యం ఢిల్లీ కుమార్ రెడ్డి, లింగాబత్తిన గోపాల్, నాగలాపురం గోవర్ధన్, తానికొండ్ల భరత్, గదిపాకుల యతీష్, పసుపులేటి నాగశేషు, వీరాస్వామి అచ్చారి, చెందు, ఫ్లెక్సీ కృష్ణారెడ్డి, యస్వంత్, హుకీమ్ సింగ్, చోటు, కైవూరి తులసి, ధనుష్, సజ్జ హరీష్, హరి, రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరిలో ఘనంగా పల్లె పండుగ





**11వేల కోట్ల పనులు ప్రారంభించిన సిఎం,**
**ఉదయగిరిలో ఘనంగా పల్లె పండుగ :**
**11వేల కోట్ల పనులు ప్రారంభించిన సిఎం, డిప్యూటీ సిఎం**





**నెల్లూరు (పెన్ పవర్ నెల్లూరు జిల్లా బ్యూరో ):**

నెల్లూరుజిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం పల్లె పండుగ 3.౦ ఘనంగా జరిగింది. వరికుంటపాడు మండలం, రామాపురంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజేపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ముఖ్య అతిధులుగా విచ్చేశారు. మధ్యాహ్నం వేరు వేరుగా రామాపురానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్వాగతం పలికారు. ఆయనతో అప్పటికే అక్కడే ఉన్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఫరూఖ్, జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఇతర ప్రజా ప్రతినిధులు చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్ కు స్వాగతం పలికారు. ముందుగా పల్లె పండుగ 3.౦ కు సంభందించిన 11వేలా 85తో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సంబంధించి వేదిక వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. అనంతరం సభా వేదికపైకి చేరుకున్నారు. ఈ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నెల్లూరుజిల్లాతో పాటూ కడప, మార్కాపురం, ప్రకాశం జిల్లాల నుండి కూడా ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బిజేపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ లు ప్రజల మధ్య ఏర్పాటు చేసి ర్యాంప్ పై నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. ప్రజలు పెద్ద ఎత్తున కేరింతలు కొడుతూ నేతలకు జేజేలు పలికారు.

# తొట్టంబేడు ప్రైమరీ, ఉన్నత పాఠశాలలో పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నిక

## ఏకగ్రీవంగా నూతన ఎస్ఎంసీ కమిటీ ఎంపిక





**తొట్టంబేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు గ్రామ జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ బాబు, ప్రాథమిక పా

ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా తొట్టంబేడు నందిని, వైస్ చైర్మన్‌గా టీ. వెంకటయ్య, అలాగే ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా అశోక్, వైస్ చైర్మన్‌గా రమణమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా తొట్టంబేడు తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం ముదిరాజ్ (మణి) కూడా కమిటీ ఎంపికలో పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులు పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చించారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చ జరిగింది.

ఈ కార్యక్రమంలో భీమల వెంకటేష్, బి. చంద్రబాబు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చివోలు పాఠశాల అభివృద్ధికి కొత్త కమిటీ

**ఎస్‌డీఎంసీ చైర్మన్‌గా ముచ్చెలి నాగరాజు.. వైస్ చైర్మన్‌గా దండి రజని ఏకగ్రీవ ఎన్నిక**

**పచ్చదనం, పరిశుభ్రత, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత: దండి నరేంద్ర**

**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాల అభివృద్ధి మరియు నిర్వహణ కమిటీ (ఎస్‌డీఎంసీ) ఎన్నికలు నిర్వహించారు. తల్లిదండ్రుల సహకారంతో మొత్తం 15 మంది సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం సభ్యుల సమక్షంలో ముచ్చెలి నాగరాజు ఎస్‌డీఎంసీ చైర్మన్‌గా, దండి రజని వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ నాయకుడు దండి నరేంద్ర నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు, చైర్మన్, వైస్ చైర్మన్‌లకు అభినందనలు తెలిపారు. రానున్న రెండేళ్లలో పాఠశాల అభివృద్ధికి కమిటీ సమష్టిగా కృషి చేయాలని



సూచించారు.

పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు పాఠశాల ఆవరణలో 100 శాతం పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముచ్చివోలు పాఠశాలను జూనియర్ కళాశాల స్థాయికి



అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన చర్యలకు కృషి చేయాలని దండి నరేంద్ర పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం, నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణంనాణ్యమైన విద్యఉజ్వల భవిష్యత్తు" అనే లక్ష్యంతో నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ముచ్చివోలు పాఠశాల అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని దండి నరేంద్ర తెలిపారు.

# ముచ్చివోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతన ఎస్ఎంసీ కమిటీ

## ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ.. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యం

**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్ ,సెప్టెంబర్ 29:**

ముచ్చివోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు సమష్టిగా కృషి చేయాలనే లక్ష్యంతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

ఈ ఎన్నికల్లో ఎస్ఎంసీ చైర్మన్‌గా శ్రీ యం. నాగరాజు, వైస్ చైర్మన్‌గా శ్రీమతి దండి రజని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 15 మంది సభ్యులతో నూతన ఎస్ఎంసీ కమిటీ ఏర్పాటైంది.

ఎన్నిక అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ జీపాలెం సురేష్ ఆధ్వర్యంలో నూతన ఎస్ఎంసీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల హాజరుచదువులో పురోగతి, పాఠశాల పరిశుభ్రత తదితర



అంశాలపై సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాలను ఆదర్శవంతమైన విద్యా సంస్థగా తీర్చిదిద్దేందుకు ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు సభ్యులందరికీ పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

## దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో ఏకగ్రీవంగా పేరెంట్స్ కమిటీ ఎన్నిక



**తొట్టంబేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయి. కమిటీ చైర్మన్‌గా సుబ్రమణ్యం రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఉషా



ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికల పరిశీలనాధికారిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, పాఠశాలలో మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు సహకరించాలని కోరారు.

అలాగే విద్యార్థుల ఆరోగ్యం, క్రమశిక్షణ, విద్యా ప్రగతి పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై కమిటీ సభ్యులు చొరవ తీసుకుని యాజమాన్యానికి సహకారం అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి శివ ప్రసాద్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పేరెంట్స్ కమిటీ పాఠశాల అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

# కుక్కల స్వైరవిహారం.. ప్రజల్లో భయాందోళన!



**ముత్యాలమ్మ గుడి వీధి, ఓటేరు కాలువ వీధి,పెరిగిన వీధికుక్కల బెడద అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 29:**

పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధి, ఓటేరు కాలువ వీధి, బాబు అగ్రహారం తదితర ప్రాంతాల్లో వీధికుక్కల సంఖ్య ఒక్కసారిగా పెరగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు రహదారులపై స్వైరవిహారం చేస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, చిన్నారులు, వృద్ధులు ఆందోళన చెందుతున్నారు.

పగలు, రాత్రి అనే తేడా లేకుండా వీధుల్లో కుక్కల గుంపులు సంచరిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వీధికుక్కల బెడదపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు వాపోతున్నారు. కుక్కల సంఖ్య మరింత పెరగకముందే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు పూర్వజన్మ సుకృతం

**శ్రీకాళహస్తి జడ్పీ బాలుర పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతాం - నూతన ఛైర్‌పర్సన్ కాపిరెడ్డి లాలస**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఛైర్‌పర్సన్‌గా కాపిరెడ్డి లాలస ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. నూతన ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన కాపిరెడ్డి లాలసకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

**ఈ సందర్భంగా కాపిరెడ్డి లాలస మాట్లాడుతూ...**

వందేళ్ల ఘన చరిత్ర కలిగిన శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు.

ప్రతి సమస్య పరిష్కారానికి కృషి

పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా



వినియోగించుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని లాలస తెలిపారు. డిజిటల్ తరగతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, క్రీడా సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

ప్రస్తుతం పాఠశాలలో 750 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వందేళ్ల చరిత్ర కలిగిన ఈ విద్యాసంస్థ ఎందరో ప్రతిభావంతులను సమాజానికి అందించిందని ఆమె గుర్తుచేశారు. ఇలాంటి చారిత్రక విద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధికి బాటలు

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సహకారం, మార్గదర్శకత్వంతో పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని కాపిరెడ్డి లాలస



తెలిపారు. పాఠశాలను నియోజకవర్గంలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యుల సమన్వయంతో ముందుకు సాగుతామని అన్నారు.

ప్రజాసేవా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి బాధ్యతలు

కాపిరెడ్డి లాలస ప్రజాసేవా దృక్పథం కలిగిన కుటుంబానికి చెందినవారు. ఆమె భర్త కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి గతంలో ఓబులాయపల్లి సర్పంచ్‌గా, శ్రీకాళహస్తి మండల జెడ్పీటీసీగా ప్రజలకు సేవలందించారు. ప్రజాసేవలో అనుభవం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన లాలస ఎస్ఎంసీ బాధ్యతలు చేపట్టడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నూతన ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీల ఏర్పాటు





**గూడూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**

గూడూరు మండలం తుంగపాలెం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రెండు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కీర్తిశేషులు పొంకం నాగేశ్వరరావు (తిరుపాలయ్య), శేషమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు హనుమంతరావు, అనిల్ కుమార్‌ల సంపూర్ణ సహకారంతో ఈ బెంచీలను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆలయానికి వచ్చే భక్తులకు ఉపయోగపడేలా సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులపై ప్రేమాభిమానాలను చాటుకుంటూ సామాజిక శ్రేయస్సు కోసం సేవ చేయడమే నిజమైన మానవత్వమని పేర్కొన్నారు. దైవ సన్నిధిలో పరోపకారం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, పొంకం సోదరుల సేవా దృక్పథాన్ని ఆయన కొనియాడారు. స్థానికులు సురేష్ రెడ్డి, రవికుమార్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. సంస్థ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా కుటుంబ సభ్యులు కాటూరి శ్రీనివాసులు, అడపాల రవికుమార్, కొండూరు సురేష్ రాజు, మాములూరు వెంకట్రావు, నాగేంద్రతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో వీధి దీపాల దుస్థితి

**పది గంటలు దాటితే పట్టణమంతా చీకటిమయం.. ప్రధాన కూడళ్లలో పెట్రోమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలి**

**క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని పోలసామి షణ్ముగం విజ్ఞప్తి**

**శ్రీకాళహస్తి, వెన్ పవర్, సెప్టెంబర్ 29:**

పట్టణంలో వీధి దీపాల నిర్వహణపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ఉద్యోగి, మాజీ ఎన్జీవోస్ అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ ఉద్యోగుల ఉపాధ్యక్షుడు పోలసామి షణ్ముగం కోరారు. ప్రధాన రహదారులతో పాటు పట్టణంలోని పలు అంతర్గత వీధుల్లోనూ వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

వీధి దీపాలు మార్చి ఎన్నో సంవత్సరాలు గడిచినప్పటికీ వాటి నిర్వహణపై తగిన శ్రద్ధ కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కొన్ని దీపాలు కూడా అరకొరగా వెలుగుతున్నాయని, సందుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పది గంటల వరకు దుకాణాలు తెరిచి ఉండటం వల్ల కొంత మేర వెలుతురు కనిపిస్తున్నప్పటికీ, ఆ తర్వాత పట్టణంలో చీకటి అలుముకుంటోందన్నారు.



ఇప్పటికే పట్టణంలో వీధి కుక్కల బెడద కూడా ఉందని, చీకటి కారణంగా ప్రజలకు భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని షణ్ముగం పేర్కొన్నారు. గతంలో పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో రెడ్‌లాంప్ లైట్లతో మంచి వెలుతురు ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు.

ప్రధాన కూడళ్లలో పెట్రోమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలి. పట్టణ సౌందర్యంతో పాటు రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందించేందుకు నిధుల లభ్యతను బట్టి ప్రధాన కూడళ్లలో ఎత్తైన పెట్రోమాక్స్ లైట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

రైల్వే స్టేషన్, ఏపీ సీడ్స్, హైస్కూల్ మలుపు, లైబ్రరీ ఎదురుగా గౌతు లచ్చన్న విగ్రహం వద్ద, పొన్నాలమ్మ గుడి, అన్న క్యాంటీన్ సెంటర్, పెళ్లిమండపం సమీపం, బేరివారి మండపం, బిక్షాల గోపురం, సన్నిధివీధి రామమందిరం, జలవినాయకుని గుడి, 4వ గేట్, వైఎస్సార్ సర్కిల్, కుమారస్వామి గుడి ప్రవేశ ద్వారం, పాత మద్రాస్ బస్టాండ్, వంగవీటి రాధాకృష్ణ విగ్రహం, శివ సర్కిల్, ధర్మరాజుల గుడి సర్కిల్, కార్గిల్ సెంటర్, శీతలాంబ గుడి, తెట్టు, నంది సర్కిల్ తదితర ప్రాంతాలను ఇందుకు అనుకూలంగా పరిశీలించాలని కోరారు.

ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రధాన కూడళ్లలో తగిన ప్రదేశాలను గుర్తించి ఎత్తైన లైట్లను ఏర్పాటు చేస్తే పట్టణం మరింత అందంగా కనిపించడంతో పాటు రాత్రి వేళల్లో చీకటిని నివారించవచ్చన్నారు.

మున్సిపాలిటీ అధికారులు, దేవస్థానం అధికారులు క్షేత్రస్థాయిలో పట్టణమంతా పర్యటించి వీధి దీపాల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించాలని, పనిచేయని దీపాలను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని షణ్ముగం విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, పట్టణ సౌందర్యం, రాత్రి వేళల్లో రాకపోకలకు అనుకూల వాతావరణం కల్పించే దిశగా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# లోకేశ్వరం మండల్ గ్రామం ధర్మారంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**లోకేశ్వరం (సెప్టెంబర్ 29 తెలంగాణ వెన్నెల వాక్కు)**

మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం (సెప్టెంబర్ 29) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీఓ సల్మాన్ రాజ్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ హాజరై, అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతీ పేదవాడికి అందాలనే ఉద్దేశంతోనే పారదర్శకంగా ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని పేర్కొన్నారు.



# గాంధీనగర్‌లో మురికి కాలువలపై కబ్జాలు తొలగించాలి

## మురుగునీటి పారుదలకు శాశ్వత పరిష్కారం చూపాలి

**గూడూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**

గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని రెండో పట్టణం గాంధీనగర్ ప్రాంతంలో మురికి కాలువలు ఆక్రమణలకు గురికావడంతో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలను ఆక్రమించి కొందరు షెడ్లు, దుకాణాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో కాలువల్లో పూడిక, చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు నిలిచిపోతోందని వారు చెబుతున్నారు.

గాంధీనగర్ తూర్పు వైపున మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు, మురుగునీరు దిగువ ప్రాంతాల్లోని గిరిజన కాలనీ వైపు చేరి ఇబ్బందులు కలిగిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మరోవైపు పడమర వైపున మురుగు కాలువలపై సిమెంట్ కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడంతో మున్సిపల్ సిబ్బంది కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

కాలువల్లో మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగి ప్రశాంత్ నగర్, నలపరెడ్డి నగర్, గిరిజన కాలనీ, నాయి బ్రాహ్మణ కాలనీ, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. దీనికి




తోడు పందుల సంచారం కూడా అధికంగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గాంధీనగర్‌లో రోడ్డు మార్జిన్లు, ప్రభుత్వ స్థలాలు, మురుగు కాలువల పరిధిలో ఆక్రమణలు పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్న బంకులు, షెడ్లతో ప్రారంభమైన ఆక్రమణలు క్రమంగా శాశ్వత నిర్మాణాలుగా మారుతున్నాయని పేర్కొంటున్నారు. కోర్టు సెంటర్ నుంచి గాంధీనగర్ చివరి వరకు ప్రధాన రహదారి మార్జిన్లలో కూడా ఆక్రమణలు ఉన్నాయని వారు తెలిపారు.

గతంలో ఆక్రమణలపై ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

2014లో ఆక్రమణలకు సంబంధించి కొందరికి నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంటూ, ప్రస్తుతం కూడా ఆక్రమణలు కొనసాగుతున్నాయని తెలిపారు.

జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు గాంధీనగర్ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ స్థలాలు, రోడ్డు మార్జిన్లు, మురుగు కాలువలను సర్వే చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలను నిబంధనల ప్రకారం తొలగించి, కాలువలకు పూడికతీత, మరమ్మతు పనులు చేపట్టి మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే దోమలు, పందుల బెడదను నివారించేందుకు పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయాలని కోరుతున్నారు.

# నాయుడుపేటలో ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

## ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా నెలవల చంద్రశేఖర్

**పెన్ పవర్ సెప్టెంబర్ 29 న జిల్లా రిపోర్టర్**

తిరుపతి జిల్లానాయుడుపేట మండల పరిధిలోని 74 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎస్ఎంసీ ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయని తిరుపతి జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.మండలంలోని మూడు గురుకుల పాఠశాలలు, తొమ్మిది ఉన్నత పాఠశాలలు, 62 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయిందన్నారు. ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా నెలవల చంద్రశేఖర్, వైస్ చైర్మన్‌గా ఓ.స్వర్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎల్.ఏ సాగరం ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల ప్రక్రియను భరత్‌కుమార్‌రెడ్డి నేరుగా పరిశీలించారు.ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతిలో నూతన కమిటీ సభ్యులు చురుకైన భాగస్వామ్యం వహించాలని సూచించారు.ఎన్నికల అనంతరం నూతన చైర్మన్ నెలవల చంద్రశేఖర్, వైస్ చైర్మన్ ఓ.స్వర్ణలను అధికారులు శాలువాలతో సత్కరించి అభినందించారు. పాఠశాల మౌలిక వసతుల



మెరుగుదల, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కమిటీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని భరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏ.ఎం.ఓ ఆర్.వి.రమణ, నాయుడుపేట మండల విద్యాశాఖ అధికారి2 బి.మునిరత్నం, ఎల్‌ఏ సాగరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ కట్టిన సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు గడదాస్ వెంకటేశ్వర్లు, జి.వి.నాయుడు, ఆనంద్, సుధాకర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది హాజరై నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తవడంపై విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ రాష్ట్ర నేతలను మర్యాదపూర్వకంగా కలిసిన గూడూరు నియోజకవర్గ ఇంచార్జి






**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,29:**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్లు మస్తాన్ వలి, జేడీ శీలం లను గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీమవరపు నరసయ్య విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై నేతల మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. గూడూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తదితర అంశాలపై కూడా చర్చించినట్లు తెలిసింది.కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాల సమగ్ర వికాసానికి సమష్టి కృషి

**చైర్మన్‌గా కడివెళ్ల సుప్రియ.. వైస్ చైర్మన్‌గా ఏ. రేవతి ఏకగ్రీవ ఎన్నిక**
**మన బడిమన పిల్లల భవిష్యత్తు" నినాదంతో నూతన కమిటీ పిలుపు**

**ఏర్పేడు ,పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

మడిబాక గ్రామ పంచాయతీ పరిధిలోని రాజులకండ్రిగ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నూతన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో చైర్మన్‌గా కడివెళ్ల సుప్రియ, వైస్ చైర్మన్‌గా ఏ. రేవతిలను నూతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బాల సరస్వతి తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ప్రథమ సమావేశంలో నూతన చైర్మన్ కడివెళ్ల సుప్రియ మాట్లాడుతూ.. తనను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న తల్లిదండ్రులు, కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు



తెలిపారు. ఈ బాధ్యతను కేవలం పదవిగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నూతన మార్గదర్శకాల మేరకు పాఠశాల సమగ్ర అభివృద్ధి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే కమిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యుల సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

వైస్ చైర్మన్ ఏ. రేవతి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి ఒక్క ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమన్నారు. నూతన మార్గదర్శకాల ప్రకారం తల్లిదండ్రులకు 75 శాతం భాగస్వామ్యం ఉన్నందున ప్రతి నెల నిర్వహించే సమావేశాలకు హాజరై తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. “మన బడి మన పిల్లల భవిష్యత్తు” అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఒక కుటుంబంలా కలిసికట్టుగా పనిచేసి రాజులకండ్రిగ ఆదర్శ పాఠశాలను ఏర్పేడు మండలంలోనే కాకుండా తిరుపతి జిల్లాలో ఒక ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు ముక్తకంఠంతో ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు, నూతన కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగకు భారీగా తరలిన ప్రజలు పల్లెలను

## పట్టణాలుగా మార్చే దిశగా ప్రభుత్వ కృషి



**జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎంపి,ఎమ్మెల్యేలు**
**ప్రజలకు ఇబ్బందులు లేకుండా భోజనం, మంచినీటి వసతులు**

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 29.**

నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గం, వరికుంటపాడు మండలం లోని రామాపురం గ్రామంలో మంగళవారం పల్లె పండుగ 3.0 కార్యక్రమం జరగనున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొని ప్రతి పల్లెలో మౌలిక వసతులు కల్పించే దిశగా కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయనున్నారు. ఈ మేరకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సారధ్యంలో నాయకులు, కార్యకర్తలు, మెప్మా, పొదుపు మహిళలు భారీగా




తరలి వెళ్లారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎంపివేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జెండాను ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పల్లెను పట్టణంగా మార్చే దిశగా నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి పవన్ కళ్యాణ్ లు భారీగా నిధులు కేటాయించనున్నారన్నారు. ఇది నిజంగానే ప్రతి పల్లెకు పండుగ కార్యక్రమం గా రూపుదిద్దుకుందని కొనియాడారు. కోవూరు నియోజకవర్గం నుండి వేలాది మంది ప్రజలు తరలి వెళ్లడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి, మున్సిపల్ వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు టిడిపి నాయకులు నెల్లూరు ప్రభాకర్ రెడ్డి, మోర్ల మురళి, స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# మన్నసముద్రం ఆదర్శ పాఠశాలలో ఎస్ఎంసీ కొత్త కమిటీ

## చైర్మన్‌గా తాళ్లపాక లక్ష్మీ.. వైస్ చైర్మన్‌గా మునిరత్నం రెడ్డి

**ఏర్పేడు ,పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

మన్నసముద్రం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలనే ఉద్దేశంతో కమిటీని ఏర్పాటు చేశారు.

ఈ ఎన్నికల్లో మొత్తం 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యుల నుంచి ఎస్ఎంసీ చైర్మన్‌గా తాళ్లపాక లక్ష్మీ, వైస్ చైర్మన్‌గా కణీయనూరు మునిరత్నం రెడ్డి ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఉపాధ్యాయులు, సభ్యులు అభినందనలు



తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కమిటీ సభ్యుల సహకారం ఎంతో అవసరమని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు సమష్టిగా కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాళ్లపాక చెంచు రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సహకారంతో సజావుగా నిర్వహించారు. నూతన కమిటీ పాఠశాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# మాచర్ల మున్సిపల్ రేస్‌లో కోమటి వీరేశ్వరరావు

## జూలకంటి అండతో కోమటి వీరేశ్వరరావు ప్రజాసేవ

**ఎన్ పవర్ సెప్టెంబర్ 29**

మాచర్ల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రోజురోజుకూ రాజుకుంటోంది. మున్సిపల్ పీఠాన్ని దక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ రేసులో మొదటి నుండి నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజాసేవనే పరమావధిగా దూసుకుపోతున్న ప్రముఖ నాయకులు కోమటి వీరేశ్వరరావు పేరు ప్రస్తుతం నియోజకవర్గంలో మారుమోగిపోతోంది. మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పీఠం ఈసారి కోమటి వీరేశ్వరరావుకు దక్కాలని నియోజకవర్గ ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ బాధ్యులు, కీలక నేత జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెన్నంటే ఉంటూ.. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ కోమటి వీరేశ్వర రావు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నిత్యం ప్రజల కష్టసుఖాలలో భాగస్వామి అవుతూ, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజాదరణను సంపాదించుకున్నారు. జూలకంటి బ్రహ్మానందరెడ్డి నాయకత్వంలో పట్టణ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కోమటి వీరేశ్వర రావు లాంటి నిబద్ధత గల నాయకుడి అవసరం ఎంతైనా ఉందని స్థానిక ఓటర్లు, టిడిపి శ్రేణులు




అభిప్రాయపడుతున్నారు. పార్టీ బలోపేతానికి, అలాగే పట్టణంలో పలు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు మరింత చేరువయ్యారు. నిత్యం ప్రజల కోసమే తపించే కోమటి వీరేశ్వరరావుకు మున్సిపల్ ఛైర్మన్ పీఠం దక్కితే మాచర్ల మున్సిపాలిటీ మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఇక్కడి ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. జూలకంటి బ్రహ్మారెడ్డి ఆశీస్సులతో వీరేశ్వరరావు ఈ రేసులో తిరుగులేని నాయకుడిగా దూసుకుపోతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# వైభవంగా శిరిడీ సాయిబాబా జన్మదిన వేడుకలు

## భక్తిశ్రద్ధలతో ప్రత్యేక భజనలు.. ఆధ్యాత్మిక సందేశాలతో అలరించిన కార్యక్రమం



**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

శ్రీ షిరిడీ సాయిబాబా వారి జన్మదినోత్సవ వేడుకలను ఏర్పేడు గ్రామంలోని శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పరిసర ప్రాంతం సాయినామస్మరణతో మార్మోగింది.

ఈ వేడుకలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ శ్రీ వరప్రసాద్, తిరుపతి జిల్లా బాలవికాస్ ఇన్‌చార్జ్ శ్రీమతి దేవసేనమ్మ, శ్రీకాళహస్తి సమితి కన్వీనర్ శ్రీ పాండురంగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సాయి తత్వం, ప్రేమ, సేవ, మానవతా విలువల ప్రాధాన్యతను వివరిస్తూ భక్తులకు అమూల్యమైన ఆధ్యాత్మిక సందేశాలను అందించారు.

వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు. భక్తి, సేవ, మానవతా మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై స్వామివారి దివ్య ప్రేమ, అనుగ్రహం, ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని శ్రీ సత్యసాయి భజన మండలి సభ్యులు ప్రార్థించారు.

# చైర్మన్ గా మాచర్ల యేబు, వైస్ చైర్మన్ గా చల్లా రామాంజమ్మ ఎన్నిక



**ఎన్ పవర్ సెప్టెంబర్ 29**

మాచర్ల నియోజకవర్గం, దుర్గి మండలంలోని ముటుకూరు గ్రామంలో గల జడ్పీ హైస్కూల్ లో విద్యాకమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ముటుకూరు గ్రామానికి చెందిన మాచర్ల యేబు ని ఛైర్మన్ గాను, వైస్ ఛైర్మన్ గా చల్లా రామాంజమ్మ ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ ఎం శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది, దుర్గి ఎస్ ఐ పలువురు విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భువనగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వ సభ్య సమావేశం...

**పి ఎస్ సి ఎస్ చైర్మన్ ఫకీర్ కొండల్ రెడ్డి కి ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే కుంభం**

**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**

భువనగిరి పిఎసిఎస్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఎస్ వి ఎస్ ఫంక్షన్ హాల్ అనాజిపురం నందు జరిగినది ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా శాసనసభ సభ్యులు శ్రీ కుంభ అనిల్ కుమార్ రెడ్డి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీ పక్కిరు కొండల్ రెడ్డి సంఘ సభ్యులు , రైతులు మరియు అధికారులు సంఘ పురోగాబివృద్ధి ఎంతగానో తోడ్పడుతున్నారని ఎప్పటికీ ఇలాగే ఉండాలని సభ్యులకు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్, బీబీనగర్ పిఎసిఎస్ చైర్మన్, చందుపట్ల పిఎసిఎస్ చైర్మన్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి , మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎల్లంల జంగయ్య , పిఎసిఎస్ భువనగిరి డైరెక్టర్లు, సోషల్ వర్కర్



ఇలియాస్ బాయ్ భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్లు, బోనగిరి మండలం సర్పంచులు, రైతులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

## -జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్






**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**
జగిత్యాల పట్టణంలోని మోచి బజార్‌లో భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో చిన్న వయసులోనే భగత్ సింగ్ చూపిన నిబద్ధత, దేశభక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జ్యోతి లక్ష్మణ్ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో అరవింద్, భానుతేజ, సన్నీ, నాయకులు శేఖర్, పవన్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజం,మీడియా రంగంలో ఎంతో ఉన్నత స్థానానికి ఎదగాలి..

## జర్నలిస్ట్ శ్యామ్ ను ఘనంగా సన్మానించిన... ఎమ్మార్పీఎస్ మిత్రబృందం





**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**
పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో జర్నలిస్ట్ శ్యామ్ ఎంతో ఉన్నత స్థానానికి ఎదగాలని, ఎమ్మార్పీఎస్ మిత్ర బృందం అన్నారు, ఈరోజు ఆత్మీయ పలకరింపు కలయిక సమావేశం జగజ్జీవన్ హాల్లో జరిగింది. ఈ ఆత్మీయ కలయికలో నాయకులు మాట్లాడుతూ, ఇటీవల జరిగిన గోకవరం ది ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం లో మిత్రుడు పెరవలి శ్యామల రావు సహాయ కార్యదర్శిగా ఎన్నిక కాబడిన సందర్భంగా శ్యామ్ ను గౌరవప్రదంగా ఆహ్వానిస్తూ ప్రేమతో పుష్పగుచం అందించి, శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మోర్త చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ చీకట్ల వెంకటేష్ ,గున్నూరు లాజర్ , ఎస్ సి, బూత్ కమిటీ లీడర్, చీకట్ల చిట్టిబాబు,ఎం ఆర్ పి ఎస్ మండలం అధ్యక్షులు పెరవలి పండు,ఎం ఆర్ పి ఎస్ మండల యువజన కమిటీ అధ్యక్షులు ఎం. దానియేలు. తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ నాపై ప్రేమతో సన్మానించిన పెద్దలకు మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతా ధన్యవాదములు. తెలియజేశారు.

## జగిత్యాల-కొత్తపేట నైట్ హాల్టు బస్సును పునరుద్ధరించండి- జగిత్యాల

## డిఎంకు విజ్ఞప్తి చేసిన రామాజీపేట సర్పంచి బెజ్జంకి మోహన్



**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేట గ్రామానికి జగిత్యాల నుండి రాయికల్ మీదుగా రామాజీపేట గ్రామం నుండి భూపతిపూర్ ద్వారా మూటపల్లి, కొత్తపేట బస్సును ఉదయం రాత్రి వేళలో బస్ తిరిగి ప్రారంభించాలని కోరుతూ రామాజీపేట సర్పంచ్ బెజ్జకి మోహన్ జగిత్యాల డిపో మేనేజర్కు వినతి పత్రం ఇచ్చారు గ్రామ ప్రజలు విద్యార్థులు ఉద్యోగులు ఇతర ప్రయాణికులు ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని గతంలో నడిచిన ఉదయం మరి రాత్రి బస్ సర్వీస్ను పునరుద్ధరించాలని డిపో మేనేజర్ను కోరగా వారి విజ్ఞప్తి మేరకు డిపో మేనేజర్ స్పందిస్తూ బస్ సర్వీసులు తిరిగి ప్రారంభించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారని బెజ్జంకి మోహన్ తెలిపారు ఈ కార్యక్రమంలో గుజ్జుల మోహన్ రెడ్డి,సుర విజయ్లు పాల్గొన్నారు

## విద్యార్థుల భవిష్యత్తుకు ఎస్ ఎమ్ సి లు కీలకం

## మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ

**ఎన్ పవర్, సెప్టెంబర్ 29::**
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ ఎమ్ సి ) చైర్మన్లు, సభ్యులందరికీ మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా, జాస్మిన్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్‌గా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ఎస్ ఎమ్ సి కమిటీ లు ఏకగ్రీవం కావడం, గ్రామాల్లో విద్య పట్ల ఉన్న చైతన్యానికి నిదర్శనం. ఈ సందర్భంగా నూతన ఎస్ ఎమ్ సి కమిటీలకు నా తరపున పలు సూచనలు చేస్తున్నాను.ఎస్ ఎమ్ సి కమిటీ లు - విద్యార్థుల హక్కుల పరిరక్షణకు వేదిక గా ఎస్ ఎమ్ సి కమిటీ అంటే కేవలం సంతకాలు పెట్టే కమిటీ కాదు విద్యా హక్కు చట్టం ( విద్యా హక్కు చట్టం -2009) ప్రకారం పాఠశాలను నడిపించే యాజమాన్య బాధ్యత మీదే ఉంది. ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటు పాఠశాలకు ధీటుగా తీర్చిదిద్దే శక్తి ఎస్ ఎమ్ సి కమిటీలకు ఉంది అని ఆయన అన్నారు.ప్రతి పిల్లాడు బడిలో ఉండాలని



మీ పాఠశాల పరిధిలో 6 నుండి 14 ఏళ్ల లోపు ఏ ఒక్క పిల్లాడు బడి మానేసి పనికి వెళ్లకుండా చూడాలని. అలాంటి వారు ఉంటే వెంటనే బడిలో చేర్పించండి ఇది వారి మానవ హక్కు అని తెలిపారు.ప్రభుత్వం ఇచ్చే కాంపోజిట్ గ్రాంట్ నిధులు,మధ్యాహ్న భోజనం నిధులను పారదర్శకంగా, పక్కాగా వినియోగించండి. ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశంలో లెక్కలు చెప్పండి. త్రాగునీరు,ఆడపిల్లలకు ప్రత్యేక టాయిలెట్స్, కరెంట్, ఫ్యాన్లు, లైబ్రరీ, ఆట స్థలం ఉన్నాయా లేదా పరిశీలించండి. లేకపోతే మండల విద్యాశాఖ అధికారి వారి ద్వారా జిల్లా కలెక్టర్ గారికి తీర్మానం పంపి సాధించడంలో కీలకపాత్ర వహించాలని సూచించారు.నాణ్యమైన విద్య, పోషణ పిల్లలకు అందుతున్న మధ్యాహ్న భోజనం,చిక్కీ,గుడ్లు నాణ్యంగా ఉన్నాయా,టీచర్లు సకాలంలో పాఠాలు చెబుతున్నారా అని గమనించాలని బాలికల రక్షణకు పాఠశాలలో ఆడపిల్లలపై వేధింపులు,బాల్య వివాహాలు జరగ కుండా చూడాలని కోరారు.అదేవిధంగా ఏ పాఠశాలలో నైనా విద్యార్థులకు మౌలిక వసతులు లేకపోయినా, ఉపాధ్యాయుల కొరత ఉన్నా, ఏదైనా సమస్య ఉన్నా, నా దృష్టికి తీసుకురండి. మానవ హక్కుల ఫౌండేషన్ మరియు జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ పాఠశాల బలపడితేనే పేద విద్యార్థి భవిష్యత్తు బలపడుతుంది. రండి, మనందరం కలిసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం.అంటూ నూతన విద్యా కమిటీల చైర్మన్ వైస్ చైర్మన్ కార్యవర్గాలకు మానవ హక్కుల ఫౌండేషన్ బొమ్మను తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బత్తిన రామకృష్ణ సూచించారు.

## జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో 25వ రక్తదాన శిబిరం

## ప్రారంభశీచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్






**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**
ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జగిత్యాల జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో జగిత్యాల ఐఎంఏ భవన్ లో "డొనేట్ బ్లడ్ సేవ్ లైవ్స్" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 25వ రక్తదాన శిబిరాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం రక్త దాత లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.
**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ**
రక్తదానం ద్వారా రోడ్డు ప్రమాదాలు,ప్రసూతి,రక్తానికి సంబంధించిన వ్యాధులు ఇతర సమయాల్లో ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నిరంతరం శిబిరాలు నిర్వహిస్తున్న ఐఎంఏ ప్రతినిధులను అభినందించారు.మానవ సేవ మాధవ సేవ అందరూ భావించాలి అన్నారు..
ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్,ఐఎంఏ సెక్రటరీ అకుతోటశ్రీనివాసరెడ్డి, కోశాధికారిడా. సుధీర్, కౌన్సిలర్ ప్రశాంత్ రావు, డా.నాగరాజు,డా.శంకర్,డాకృష్ణ మూర్తి,విమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ , వైద్యులు, నాయకులు, ఐఎంఏ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్సీ కోఆర్డినేటర్‌గా నియామకం..

## బెక్కం జనార్ధన్‌కు ఘన సన్మానం



**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**
ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా జనసేన పార్టీ తరఫున బెక్కం జనార్ధన్ నియమితులైన సందర్భంగా జగిత్యాల జిల్లాకు చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ, పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పట్టభద్రుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతం కోసం బెక్కం జనార్ధన్ చేస్తున్న కృషిని అభినందించారు.
బెక్కం జనార్ధన్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని, పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.
ఈ సన్మాన కార్యక్రమంలో జగిత్యాల జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వికలాంగురాలు కు అండగా భారతీయ జనతా

## పార్టీ ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు కిరణ్ నాయక్

**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంనికి చెందిన శివరాత్రి ఎల్లవ్వ పుట్టుకతో అంగవైకల్యారాలు 2014లో లైఫ్ సదరన్ సర్టిఫికెట్ పొంది 71% ఉండగా పెన్షన్ వస్తుండగా గత పది నెల క్రితం సదరం సర్టిఫికెట్ రెన్యువల్ పేరుమీద అధికారులు 31% మార్చి ఆ వికలాంగురాలి పింఛన్ కట్ చేయడం జరిగింది అట్టి విషయాన్ని జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి శివరాత్రి ఎల్లవ్వ కు న్యాయం చేయాలని కోరినారు అధికారుల అలసత్వమో చేతివాటం అందకనో అభాగ్యురాలి పింఛన్ కట్ చేసి రాక్షసానందం పొందుతున్న అధికారులను ప్రశ్నిస్తూ అట్టి తప్పిదాన్ని సరిదిద్ది పెన్షన్ అందేలా చేయాలని భారతీయ జనతా పార్టీ మండల శాఖ తరపున డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మేంబర్



చందుపట్ల లక్ష్మారెడ్డి వార్డు సభ్యుడు లింగాపురం ఆంజనేయులు వార్డు మెంబర్ కొత్త చేన్నయ్య పాల్గొన్నారు

## నిర్మల్ పట్టణంలో ఘనంగా 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం.









**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**
పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశంతో నిర్మల్ పట్టణంలో మంగళవారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న ఈ మాసోత్సవాల్లో భాగంగా, బ్యాంక్ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా ధర్మసాగర్ పరిసర ప్రాంతాలతో పాటు బస్ స్టాండ్ ఆవరణలో భారీ పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రయోజనార్థం పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.
ఈ కార్యక్రమంలో అధికారులంతా స్వయంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. వీధి పరిసరాలు, ప్రజా రవాణా కేంద్రాల వద్ద చెత్తను తొలగిస్తూ పరిసరాల శుభ్రత ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యత అని గుర్తు చేశారు. ప్రతి పౌరుడు తమ ఇల్లు, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా నిర్వాహకులు పిలుపునిచ్చారు.
ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఎల్డీఎం రామ్ గోపాల్, టీజీబీ రీజినల్ మేనేజర్ నవీన్ తో పాటు పలువురు బ్యాంకింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది స్వయంగా పాల్గొన్నారు.

## ధర్మోరలో యూనిఫాంల పంపిణీ చేసిన సర్పంచ్



**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**
లోకేశ్వరం మండలం ధర్మోర గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీస్ ) లో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ విద్యార్థులకు సర్పంచ్ మరియు గ్రామస్తులు అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి సంజీవరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంద గణేష్ పంచాయతీ సెక్రెటరీ పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సుమారు 600 గొర్రెల మృతి.. బాధిత రైతును పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ఎన్ పవర్, సెప్టెంబర్ 29:**
యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య కొండమడుగు సమీపంలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. అర్ధరాత్రి సమయంలో కుక్కలు, అడవి పందులు బెదిరించడంతో భయపడిన సుమారు 600 గొర్రెల మంద రైల్వే ట్రాక్‌పైకి రావడంతో, అదే సమయంలో అటుగా వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గొర్రెలన్నీ అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో గొర్రెల యజమాని కిష్టయ్యకు దాదాపు రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా తన జీవనాధారమైన గొర్రెలన్నీ మృతి చెందడంతో కిష్టయ్య కన్నీరుమున్నీరుగా విలపించారు.
విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య గారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును స్థానికులు, బాధిత రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత రైతు కిష్టయ్యను పరామర్శించి ధైర్యం చెప్పారు. జరిగిన నష్టంపై విచారం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.
అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీ భాస్కర్ రావు గారితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ప్రమాద వివరాలను ఆయనకు తెలియజేశారు. ఘటనపై అధికారులు వెంటనే స్పందించి పంచనామా నిర్వహించి, జరిగిన నష్టాన్ని అంచనా వేసి, బాధిత రైతు కిష్టయ్యకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



జీవనోపాధిగా పెంచుకుంటున్న వందలాది గొర్రెలను కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు.

# మంగళగిరిలో లోకేష్‌కు ప్రత్యర్థి ఎవరు? వైసీపీకి అసలు సమస్య అభ్యర్థా.. వ్యూహమా?



**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సొంత నియోజకవర్గం మంగళగిరిలో పట్టు కోసం వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 91 వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన మంత్రి లోకేశ్ నియోజకవర్గంలో పట్టు పెంచుకునేలా విస్తృతంగా పనిచేస్తుండగా, ఆయనకు సరైన ప్రత్యర్థిని రంగంలో దింపేందుకు వైసీపీ కూడా అదే స్థాయిలో వ్యూహాలు రచిస్తోందని అంటున్నారు. కూటమిలో కీలక నాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు అయిన లోకేశ్ హవాను నిలువరించాలనే ఉద్దేశంతో వైసీపీ తాజాగా నియోజకవర్గం ఇంచార్జిని మార్పు చేసిందని చెబుతున్నారు. దీంతో గత మూడేళ్లలో ఐదోసారి మంగళగిరి వైసీపీ సమన్వయకర్తను మార్చినట్లైందని అంటున్నారు.

రాజధాని అమరావతి పరిధిలో ఉండటంతో మంగళగిరికి ప్రాధాన్యం ఒక్కసారిగా పెరిగిపోయింది. అదే సమయంలో రాష్ట్రమంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తుండటం, ఇదే నియోజకవర్గం పరిధిలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం, పార్టీ ప్రధాన కార్యాలయం కూడా ఉండటంతో సహజంగా మంగళగిరి రాజకీయాలు రాష్ట్రస్థాయిలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మరోవైపు మంత్రి లోకేశ్ గత ఎన్నికల్లో నిలవడం ఒక ఎత్తు అయితే, ఆ గెలుపును శాశ్వతంగా చేసుకునేలా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. ఇదే సమయంలో వైసీపీ కూడా తమ చేజారిన మంగళగిరిని తిరిగి కైవసం చేసుకోడానికి చాలా ప్రయత్నాలు చేస్తుందని అంటున్నారు. అయితే ఈ విషయంలో తరచూ ఇన్‌చార్జిలను మార్చుతుండటంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### కొత్తగా సోమిరెడ్డికి బాధ్యతలు

మంగళగిరి వైసీపీ సమన్వయకర్తగా బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని నియమిస్తూ అధినేత జగన్మోహనరెడ్డి రెండు రోజుల క్రితం నిర్ణయం తీసుకున్నారు. సుమారు రెండేళ్లుగా పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న దొంతిరెడ్డి వేమారెడ్డిని తప్పించి అధినేత జగన్ రెడ్డి అనూహ్యంగా తీసుకున్న ఈ నిర్ణయం తీవ్ర చర్చకు దారితీస్తోంది. నిజానికి మంగళగిరి ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీలోనే ఉన్నప్పటికీ అధినేత జగన్ రెడ్డి మాత్రం కొత్తవారిని తెరపైకి తెస్తూ లోకేశ్ కు దీటైన ప్రత్యర్థిని తయారు చేయాలని చూడటమే రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. 2024 ఎన్నికల వరకు నియోజకవర్గ వ్యవహారాలను ఆళ్ల రామకృష్ణారెడ్డి మాత్రమే చూసుకునేవారు. ఆయన ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అనూహ్యంగా రాజీనామా చేయడంతో అప్పటివరకు టీడీపీలో ఉన్న గంజి చిరంజీవిని పార్టీలోకి తీసుకుని ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే ఎన్నికల్లో పోటీకి ఆయనకు టికెట్ ఇవ్వకపోవడంతో వెంటనే రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. ఇక 2024 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కోడలు లావణ్యను పోటీకి పెట్టారు. ఎన్నికల తర్వాత లావణ్య స్థానంలో దొంతిరెడ్డి వేమారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఆయనను తప్పించి వేణుగోపాల సోమిరెడ్డిని నియమించడమే హాట్ టాపిక్ అవుతోంది.

### సరైన ప్రత్యామ్నాయం కోసమేనా?

తాజాగా వైసీపీ ఇన్‌చార్జిని మార్చడంపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలో అధికార పార్టీ దూకుడుకు కళ్లెం వేయలేకపోతున్నారనే ఆలోచనతోనే కొత్తవారిని తెరపైకి తెచ్చారని అంటున్నారు. రాజకీయాలకు కొత్త అయిన వేణుగోపాలసోమిరెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తే ఎటువంటి విమర్శలకు తావులేకుండా, అందరినీ కలుపుకుని పోయే అవకాశాలు ఉంటాయని పార్టీ అధిష్టానం భావించిందని అంటున్నారు. అయితే తరచూ ఇన్‌చార్జులను మార్చడం వల్ల ప్రయోజనం లేదని, మంత్రి లోకేశ్ వంటి బలమైన ప్రత్యర్థికి దీటుగా పార్టీ కూడా ఇన్‌చార్జులకు సహకరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికార బలంతోపాటు అంగ బలం, అర్థబలంతో లోకేశ్ ముందు దీటుగా నిలవాలంటే ఎవరికైనా పార్టీ పూర్తిస్థాయిలో అండదండగా నిలవాల్సివుందని అంటున్నారు. మంగళగిరి విషయంలో పార్టీ అధిష్టానం నుంచి ఇప్పటివరకు ఇలాంటి సహకారం అందడం లేదని కార్యకర్తలు చెబుతున్నారు.

### మంగళగిరిపై వైసీపీ జెండా ఎగరేయొచ్చా?

మంత్రి లోకేశ్ కు చెక్ చెప్పాలంటే వైసీపీ ఇన్‌చార్జి మార్పు ఒక్కటే సరిపోతుందా? అనేది ప్రస్తుతం హాట్ టాపిక్ అవుతోంది. ఈ విషయంలో వైసీపీ అధిష్టానం ఆలోచన కూడా మారాల్సివుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గత ఎన్నికల తర్వాత మంగళగిరిలో లోకేశ్ పాతుకుపోయేలా పనిచేస్తుండగా, ఆయన కదలికలను గమనిస్తూ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేలా వైసీపీ పనిచేయాల్సివుందని అంటున్నారు. ఈ ఉద్దేశంతోనే ప్రస్తుత ఇన్‌చార్జిని మార్చినట్లు భావిస్తున్నారు. అయితే కొత్త వారిని ముందుకు నడిపేలా పార్టీ అధిష్టానం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. నిజానికి గత ఎన్నికల్లో కోల్పోయిన ఓట్లను తిరిగి పొందేందుకు పార్టీ అధిష్టానం ఫోకస్ చేయాల్సివుందని కార్యకర్తలు సూచిస్తున్నారు. ఇన్‌చార్జి ఒక్కరే కాకుండా ఏయే వర్గాల ఓటర్లు దూరమయ్యారు? ఎందుకు దూరమయ్యారు? అన్న కోణంలో ఆలోచించి, అందుకు తగిన వ్యూహాలు సిద్ధం చేయాల్సివుందని అంటున్నారు. పార్టీలో ఈ సన్నద్ధత లేకుండా ఇన్‌చార్జులను మార్చుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### గత ఎన్నికల్లోనే పెరిగిన టీడీపీ బలం

వైసీపీ ఆవిర్భవించిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో రెండుసార్లు మంగళగిరి నుంచి వైసీపీ గెలిచిందని గణాంకాలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లోనే టీడీపీ ఇక్కడ గెలిచింది. అయితే 2014, 2019లో వైసీపీ గెలిచిన రెండుసార్లు ఆ పార్టీ స్వల్ప ఓట్లతోనే గట్టెక్కిందని అంటున్నారు. 2014లో కేవలం 12 ఓట్లతో ఈ స్థానాన్ని వైసీపీ గెలుచుకోగా, 2019లో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి హవాలోనూ సుమారు 5 వేల ఓట్లతో గెలిచిందని చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం టీడీపీపై పైచేయి సాధించాలంటే వైసీపీ వ్యూహాత్మకంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. నియోజకవర్గంలో దాదాపు మూడు లక్షల ఓటర్లు ఉండగా, గత ఎన్నికల్లో 2.53 లక్షల ఓట్లు పోలయ్యాయని చెబుతున్నారు. ఇందులో వైసీపీకి 76 వేల ఓట్లు పడ్డాయని లెక్కలు చెబుతున్నాయి. ఇక 2019 ఎన్నికల్లో సుమారు 1.08 లక్షల ఓట్లు సాధించి 5 వేల ఓట్ల మెజార్టీతో వైసీపీ గెలిచింది. అంతకుముందు ఎన్నికల్లో సుమారుగా 89 వేల ఓట్లు పొందింది. అప్పుడు టీడీపీకి కూడా అంతే సంఖ్యలో ఓట్లు పోలవ్వగా, పదేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ దాదాపు 1.67 లక్షల ఓట్లకు ఎగబాకిందని లెక్కలు చెబుతున్నాయి. అంటే మంగళగిరిలో టీడీపీని పడగొట్టేందుకు వైసీపీ ఓటుబ్యాంకు రెండింతలు పెరగాల్సివుందని అంటున్నారు. గత ఎన్నికల్లో కూటమి గాలిలోనూ 76 వేల ఓట్లు సాధించిన నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి అదనంగా మరో 76 వేల ఓట్లు పొందేలా వైసీపీ పనిచేయాల్సివుందని అంటున్నారు. అధిష్టానం ఈ దిశగా అడుగులు వేసినప్పుడే ఇన్‌చార్జులు కూడా మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉందని అంటున్నారు.

# జనసేనకు కల్ట్ పొలిటికల్ ఇమేజ్

**కాకినాడ, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని సాధించిన కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీలోకి ప్రస్తుతం ఇతర పార్టీల, ముఖ్యంగా ప్రతిపక్ష వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి, నియోజకవర్గ స్థాయి నేతల నుంచి భారీగా చేరికలు సాగుతున్నాయి. ఓటమి భారం, భవిష్యత్తుపై అస్పష్టతతో తీవ్ర అంతర్మథనంలో ఉన్న వైసీపీ నేతలు జనసేన వైపు చూపుతుండటంతో, రాష్ట్రంలో వైసీపీకి పూర్తిస్థాయి ప్రత్యామ్నాయాన్ని జనసేన ఆక్రమించే అవకాశం ఉందా అనే అంశంపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఉత్తరాంధ్ర నుంచి నెల్లూరు వరకు కూటమి కారణంగా వైసీపీ రాజకీయ పునాదులు గణనీయంగా బలహీనపడ్డాయనేది కొట్టిపారేయలేని నిజం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకోవడం సులభం కాదన్న భావనతో క్షేత్రస్థాయి శ్రేణులు, నాయకులు కొత్త రాజకీయం కోసం వెతుకులాడుతున్నారు. ఈ క్రమంలో అధికారంలో ఉండటంతో పాటు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవ, సాధిస్తున్న ఇమేజ్ చాలామందికి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. కేవలం నియోజకవర్గ నేతల చేరికలే కాకుండా, పూర్తిస్థాయిలో లీడర్లను, క్యాడర్‌ను నిలకడగా పార్టీలోకి తెచ్చుకోగలిగితేనే ఈ వలసలు రాజకీయ బలంగా మారేందుకు ఆస్కారం ఉంటుంది. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకును, స్థానిక నేతలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏ రకంగానైతే క్రమంగా తన వైపు తిప్పుకొని సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారో, ఇప్పుడు పవన్ కళ్యాణ్ కూడా వైసీపీ వద్ద ఉన్న అసంతృప్తికరమైన ఓటు బ్యాంకును, ఆ పార్టీ క్యాడర్‌ను తనవైపు మళ్లించుకోవాల్సిన వ్యూహాత్మక అవసరం ఉంది. ఓటు బ్యాంకు అనేది కేవలం చేరికలతోనే మారదు. దానికి క్షేత్రస్థాయిలో నమ్మకాన్ని కల్పించే సంస్థాగత నిర్మాణం అవసరం. వైసీపీ శ్రేణులు జనసేన సిద్ధాంతాలను, పవన్ నాయకత్వాన్ని స్వీకరించి, వారంతా శాశ్వత ఓటర్లుగా మారేలా సరైన రోడ్‌మ్యాప్ రూపొందించుకుంటేనే ప్రత్యామ్నాయ రాజకీయం రూపుదిద్దుకుంటుంది. జనసేన ప్రత్యామ్నాయంగా ఎదగడానికి ప్రధాన అడ్డంకి, సంక్లిష్టత ప్రస్తుతం ఉన్న కూటమి రాజకీయాలే. టీడీపీతో కలిసి ప్రభుత్వం నిర్వహిస్తున్న వేళ, వైసీపీకి వ్యతిరేకంగా పోరాటంలో తన స్వతంత్రతను కాపాడుకుంటూనే, పొత్తుకు విఘాతం కలగకుండా నాయకులను చేర్చుకోవడం ఒక కత్తిమీద సాము. ముఖ్యంగా కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో టీడీపీతో ఎలాంటి ఘర్షణాత్మక వాతావరణం రాకుండా, వైసీపీ ఓటు బ్యాంకునూ, లీడర్లనూ తన గూటికి చేర్చుకోవడంలో జనసేన అనుసరించే రాజకీయంపైనే పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. పవన్ కళ్యాణ్‌కు ఉన్న అపారమైన వ్యక్తిగత క్రేజ్, కల్ట్ ఇమేజ్ స్థిరమైన రాజకీయ శక్తిగా మారాలంటే నిలకడైన ప్రజాదరణతో పాటు పక్కా సంస్థాగత బలం తోడవాలి. వైసీపీ ఓటు బ్యాంకును, స్థానిక నాయకత్వాన్ని పకడ్బందీగా స్వీకరించి, రాయలసీమతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బలమైన పార్టీ క్యాడర్‌ను నిర్మించిన రోజున -- పవన్ తన అసలైన కల్ట్ రాజకీయ పవర్‌ను చూపించే అవకాశం లభిస్తుంది. ఒకవేళ ఈ ఫ్లో ఇలాగే కొనసాగి, వైసీపీలోని ఖాళీని జనసేన భర్తీ చేయగలిగితే, రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాలు టీడీపీ-వైసీపీ పోరు నుంచి టీడీపీ వర్సెస్ జనసేన వైపు మారినా ఆశ్చర్యపోనవసరం లేదు.

# మంత్రివర్గంలో నో సీనియర్స్

**విజయవాడ, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** మరికొద్ది రోజుల్లో ఏపీ మంత్రి వర్గ విస్తరణ ఉండనుందన్న ప్రచారం ఊపందుకుంది. రెండున్నరేళ్లు ముగిసిన తర్వాత కేబినెట్ మార్పులపై టీడీపీలో ఇప్పటి నుంచి చర్చ జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గాన్ని ఇలా ఎంపిక చేయడం వెనక కూడా దూరాలోచన ఉందని అంటున్నారు. రానున్న మంత్రి వర్గ విస్తరణలో కూడా సీనియర్లకు అవకాశం ఉండదన్న వాదన వినిపిస్తుంది. మరోసారి జూనియర్లకే అవకాశం ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు కారణాలు కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి వర్గ కూర్పులో సాంప్రదాయ రాజకీయ సమీకరణాలకు భిన్నంగా, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత వ్యూహాత్మక ఆలోచనలతో మంత్రులను ఎంపిక చేశారు. సీనియర్లను పక్కనపెట్టి మరీ ఎక్కువ మంది కొత్తవారికి చోటు కల్పించడం వెనుక ఆయనకున్న ప్రధాన ఆలోచనలు, వ్యూహాలు అనేకం ఉండొచ్చు. కొత్త నాయకత్వాన్ని తయారు చేయడం ఇందుకు ఉదాహరణ. మంత్రివర్గంలో మొత్తం 24 మంది మంత్రులలో 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన పదిమందికి పైగా నేరుగా మంత్రి పదవులు దక్కాయి. రాబోయే కొన్ని దశాబ్దాల పాటు టు పార్టీని, రాష్ట్రాన్ని నడిపించగల సమర్థులైన ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ఇప్పుడే తయారు చేయాలనేది చంద్రబాబు సుదీర్ఘ వ్యూహమని చెబుతున్నారు.. బీసీలకు పెద్దపీటమంత్రివర్గంలో వెనుకబడిన తరగతులకు 8 పదవులు, కాపులు మరియు కమ్మ సామాజిక వర్గాలకు చేరో 4 పదవులు, ఎస్సీలకు 3, ఎస్టీ మరియు మైనారిటీలకు ఒక్కో పదవి చొప్పున కేటాయించారు. ఆలోచన: టిడిపికి సాంప్రదాయకంగా అండగా ఉండే బీసీలకు ఈసారి కూడా పెద్దపీట వేయడం ద్వారా సామాజిక సమతూకాన్ని పాటించారు. అంతేకాకుండా మహిళలకు, గిరిజన ప్రాంతాలకూ ప్రాతినిధ్యం కల్పించారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బుచ్చయ్య చౌదరి, కన్నా లక్ష్మీనారాయణ వంటి హేమాహేమీ సీనియర్లను మంత్రివర్గంలోకి తీసుకోలేదు. ఆలోచన: సీనియర్లను కేవలం పరిపాలనకే పరిమితం చేయకుండా, వారి అనుభవాన్ని పార్టీ సంస్థాగత బలోపేతానికి మరియు శాసనసభ వ్యవహారాల నిర్వహణకు వాడుకోవాలనేది చంద్రబాబు ఆలోచన. పర్ఫార్మెన్స్ ఆధారిత పాలనమంత్రివర్గాన్ని ఎంపిక చేసిన తర్వాత కూడా చంద్రబాబు మంత్రుల పనితీరుపై నిరంతరం సమీక్షలు జరుపుతున్నారు. మంత్రులకు అంతర్గతంగా ర్యాంకులు ఇవ్వడం ద్వారా వారిలో పోటీతత్వాన్ని పెంచుతున్నారు. గత ప్రభుత్వం వల్ల దెబ్బతిన్న వ్యవస్థలను బాగు చేయాలన్నా, కేంద్ర నిధులను రాబట్టాలన్నా మంత్రులు నిరంతరం క్రియాశీలకంగా ఉండాలనేది ఆయన ఆలోచనఅని చెబుతున్నారు. కేవలం పదవుల అనుభవం కోసం కాకుండా డెలివరీ ఆధారంగానే మంత్రుల భవిష్యత్తు ఉంటుందని బాబు స్పష్టం చేశారు. మొత్తంగా చూస్తే, చంద్రబాబు నాయుడు ఈసారి కేవలం రాజకీయ లెక్కల కోసమే కాకుండా, వేగవంతమైన అభివృద్ధి, సమర్థవంతమైన పాలన , మరియు పార్టీ భవిష్యత్తు పునాది అనే త్రివిధ వ్యూహంతోనే ఈ మంత్రుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారని, రేపు మంత్రి వర్గ విస్తరణ జరిగినా ఇలాగే ఉంటుందని అంటున్నారు.

## అమరావతి ఔటర్ రింగ్ రోడ్ కు లైన్ క్లియర్

**విజయవాడ, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 189.93 కిలోమీటర్ల పొడవునా 6 లేన్లతో నిర్మించనున్న ఈ ఔటర్ రింగ్ రోడ్డు పనులను 4 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసి ఎన్‌హెచ్ఏఐ కి ప్రతిపాదనలు పంపించారు. ఈ రహదారితో పాటు నారాకోడూరు నుంచి గుంటూరు శివార్లలోని బుడంపాడు వరకు 5.2 కిలోమీటర్ల పొడవునా 4 వరుసల స్పర్ రోడ్డును కూడా అనుసంధానం చేయనున్నారు. దీంతో ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు 195.13 కిలోమీటర్లకు చేరుకుంది. అమరావతి ఓఆర్ఆర్‌లో కృష్ణా నదిపై 2 వంతెనలు, 3 సొరంగాలు సహా అన్ని పనులు కలిపి 4 ప్యాకేజీలుగా విభజించారు. గతంలో ప్రతి 25 నుంచి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 6 నుంచి 8 ప్యాకేజీలుగా నిర్మించాలని మొదట భావించినప్పటికీ, పనుల పర్యవేక్షణ సులభతరం చేసేందుకు ప్యాకేజీల సంఖ్యను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మొదటి ప్యాకేజీ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వద్ద విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి ప్రారంభమై కొండపల్లి, పంగిడి అటవీ ప్రాంతాల మీదుగా మైలవరం వరకు (27వ కిలోమీటర్) సాగుతుంది. ఇందులో 2 సొరంగాలు ఉంటాయి. అలాగే చివర్లో ఉండే 189వ కిలోమీటర్ నుంచి 189.93 కిలోమీటర్ వరకు ఉన్న పనులను ఈ మొదటి ప్యాకేజీలోనే చేర్చారు. రెండో ప్యాకేజీ మైలవరం 27వ కిలోమీటర్ నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను సమీపంలోని 83వ కిలోమీటర్ వరకు మొత్తం 56 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. మూడో ప్యాకేజీ కోలవెన్ను 83వ కిలోమీటర్ నుంచి ప్రారంభమై గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని 133.5వ కిలోమీటర్ వరకు 50.5 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ ప్యాకేజీలో అదనంగా నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు ఉండే 5.2 కిలోమీటర్ల కనెక్టింగ్ రోడ్డుతో పాటు, వల్లూరుపాలెం వద్ద కృష్ణానదిపై 4.8 కిలోమీటర్ల పొడవైన వంతెన నిర్మించనున్నారు. నాలుగో ప్యాకేజీ పుల్లడిగుంట (133.5 కి.మీ) దగ్గర మొదలై ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల సమీపంలోని 189వ కిలోమీటర్ వరకు 55.5 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ ప్యాకేజీలో పేరేచర్ల వద్ద 400 మీటర్ల సొరంగం, మున్నలూరు వద్ద కృష్ణానదిపై 3.15 కిలోమీటర్ల మేర వంతెన ఉంటాయి. ఈ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్ మొత్తం అంచనా వ్యయం రూ.30,491 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 4 ప్యాకేజీలకు కలిపి సివిల్ పనుల నిమిత్తం రూ.10,595.70 కోట్లు అవసరమని అంచనా వేశారు. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.5,315 కోట్లు నిధులు కేటాయించారు. మిగిలిన నిధులను పర్యావరణ, అటవీ అనుమతుల ఖర్చులు, విద్యుత్ లైన్ల తరలింపు, మరియు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద 15 ఏళ్లపాటు వడ్డీతో కూడిన చెల్లింపుల నిమిత్తం వినియోగించనున్నారు.

## కాపులకు వైసీపీ గాలం

**విజయవాడ, సెప్టెంబర్ 29, పెన్ పవర్:**

ఏపీ రాజకీయాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ తన ఉనికిని చాటుకోవడానికి, కూటమి ఐక్యతను దెబ్బతీయడానికి అనేక మార్గాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగానే రాబోయే రోజుల్లో కూటమిలోని కీలక భాగస్వామి అయిన జనసేనను, దాని మూలస్తంభమైన సామాజికవర్గాన్ని టార్గెట్ చేయడం ఒక వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారింది. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో చోటుచేసుకున్న వంగవీటి రంగా విగ్రహ వివాదం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. నియోజకవర్గ పరిధిలోని స్థానిక సెంటిమెంట్లను రగిల్చి, దాని ద్వారా కూటమిలోని పార్టీల మధ్య -- ప్రత్యేకించి టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య -- అపోహలు సృష్టించేందుకు వైసీపీ సిద్ధం చేసిన ఒక రాజకీయ ప్రణాళిక అని జరిగిన దాన్ని బట్టి చూస్తే అర్థమైపోతుంది. ఏదైనా ప్రాంతంలో విగ్రహాల ఏర్పాటుకు స్థానిక పరిపాలనా అనుమతులు తప్పనిసరి. కానీ, స్థానిక అధికారులు మంత్రి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకునే లోపే, అనుమతుల కాలయాపనను నెపంగా చూపి రాత్రికి రాత్రే విగ్రహాన్ని పెట్టేయడం వెనుక స్పష్టమైన ఉద్దేశం కనిపిస్తోంది. విగ్రహం తొలగింపు పరిణామాలను తమ రాజకీయ లబ్ధికి వాడుకోవాలనేది ఇక్కడ వ్యూహం. ఈ క్రమంలోనే రాజకీయ అరంగేట్రం కోసం వేచి చూస్తున్న వంగవీటి ఆశాకిరణ్ వంటి నాయకులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని భావోద్వేగపూరితమైన వ్యాఖ్యలు చేయడం, రాజకీయాన్ని తీవ్రతరం చేయడం గమనార్హం. ప్రజా సమస్యలపై కాకుండా విగ్రహ రాజకీయాలపై ఆత్రుత చూపడం వెనుక ఉన్న స్వార్థం ప్రజలకు స్పష్టంగానే అర్థమవుతోంది. ఈ ఉదంతం వెనుక ఉన్న ప్రధాన కుట్ర కూటమిలోని జనసేన ఓటు బ్యాంకును వేరు చేయడం. టీడీపీ పాలన వల్ల రంగా విగ్రహానికి అన్యాయం జరిగిందనే ప్రచారాన్ని హోరెత్తించడం ద్వారా ఆ వర్గం యువతలో అసంతృప్తి రగల్చాలని వైసీపీ భావిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందనే నిజాన్ని మరిపించి, కేవలం కుల కోణాన్ని మాత్రమే ముందుకు నెట్టడం ద్వారా జనసేనకు లభించే సామాజిక మద్దతును బలహీనపరచడమే దీని అంతిమ లక్ష్యం. కాపు సెంటిమెంట్‌ను జనసేన నుండి వేరు చేస్తే తప్ప, ఆ పార్టీ రాజకీయ బలహీనత సాధించలేమనే అంచనాతోనే వైసీపీ ఈ రకమైన వ్యూహాలకు పదును పెడుతోంది. రాజకీయంగా ఇప్పుడిప్పుడే ప్రాధాన్యత పొందుతూ, సమ్మిళిత అధికారంలో కీలక పాత్ర పోషిస్తున్న ఒక వర్గానికి లేదా పార్టీకి ఇలాంటి వివాదాలు పెద్ద అగ్నిపరీక్ష వంటివి. అధికారంలో ఉన్నప్పుడు ఏ కొద్దిపాటి తొందరపాటు లేదా అతిగా స్పందించే ధోరణి కనిపించినా, అది ఇతర వర్గాల్లో ప్రతికూల భావన పెరిగేలా చేస్తుంది. తాము అధికారంలో ఉన్నామన్న భావనతో క్షేత్రస్థాయి శ్రేణులు సంయమనం కోల్పోతే, అది మిగిలిన సామాజికవర్గాలను దూరం చేసే ప్రమాదం ఉంది. ప్రత్యర్థులు పన్నిన ఈ కుల రాజకీయ వలలో చిక్కుకోకుండా ఉండాలంటే, భావోద్వేగాల కంటే పరిపక్వతతో కూడిన నిశ్శబ్ద వ్యూహం చాలా అవసరం. వైసీపీ విసిరిన ఈ విగ్రహ రాజకీయం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సింది కూటమి నాయకత్వమే. చిన్న విషయాలను సైతం పెద్ద వివాదాలుగా మార్చేందుకు ప్రతిపక్షం సిద్ధంగా ఉందనే వాస్తవాన్ని గుర్తించాలి. అధికారంలో ఉన్న పక్షాలు ముందస్తుగా చట్టబద్ధమైన పరిష్కారాలు చూపాలి తప్ప, వివాదాలు పెరిగే వరకు వేచి చూడకూడదు. కాపు ఓటు బ్యాంకుతో పాటు ఇతర వర్గాల మద్దతును సమతుల్యంగా కాపాడుకోవాలంటే, జనసేన శ్రేణులు తీవ్ర సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, ప్రత్యర్థులు ఆశించినట్లుగానే సామాజిక సమీకరణాలు దెబ్బతిని, అంతిమంగా రాజకీయంగా ఎదిగుతున్న వర్గానికే కోలుకోలేని నష్టం జరుగుతుంది. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయన్న సంగతిని ఎవరూ మర్చిపోకూడదు.

## డైరక్ట్ ఎన్నికలతో ఇబ్బందులేనా

**నెల్లూరు, సెప్టెంబర్ 29, పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం మున్సిపల్ చట్టాలకు సవరణలు చేస్తూ మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్‌లను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించడం వైసీపీ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తోంది. పరోక్ష ఎన్నికల విధానంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలిపించుకుని, అనంతరం రాజకీయ సమీకరణాలతో , క్యాంప్ రాజకీయాలతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి , కనీసం గట్టి పోటీ ఇవ్వడానికి అవకాశముండేది. వార్డుల వారీగా పరిమిత శక్తిని ఉపయోగించి కొన్ని స్థానాలు గెలిచినా పార్టీ ఉనికి ఉందనే " సంకేతాలు ఇచ్చే అవకాశం దక్కేది. అయితే, నగర లేదా పట్టణ స్థాయి మొత్తాన్ని ఒకే నియోజకవర్గంగా భావించి జరిగే ఈ ప్రత్యక్ష పోరులో విజయం సాధించాలంటే విస్తృతమైన ప్రజాదరణతో పాటు సమగ్రమైన యంత్రాంగం అవసరం. ఇది ప్రతిపక్షంలో ఉన్న వైసీపీకి అతిపెద్ద సమస్యగా మారింది. మేయర్ , ఛైర్మన్ స్థాయి ప్రత్యక్ష ఎన్నికలంటే నగరమంతటా ప్రచారం నిర్వహించడం, భారీ ఎత్తున ఆర్థిక, అంగబలాలను సమకూర్చుకోక తప్పదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీల వైపు నుంచి నగరాల్లో పోటీకి బలమైన ఆర్థిక సామర్థ్యం, సామాజిక మద్దతు ఉన్న నేతలు సులభంగానే సిద్ధమవుతున్నారు. మరోవైపు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ తరపున అంత భారీగా ఖర్చు పెట్టి, అధికార యంత్రాంగాన్ని ఎదుర్కొని పోరాడేందుకు ఆ స్థాయి హెవీవెయిట్ అభ్యర్థులు లభించడం కష్టంగా మారింది. పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారు కూడా భారీగా సొంత నిధులు వెచ్చించడానికి వెనుకంజ వేస్తుండటంతో, ప్రధాన నగరాల్లో పరువు నిలబెట్టుకునే స్థాయిలో బలమైన అభ్యర్థులను ఖరారు చేయడం పార్టీ నేతలకు పెద్ద సవాలుగా మారింది. గతంలో వార్డు స్థాయి ఎన్నికల్లో స్థానిక బలగాలు, వ్యక్తిగత సంబంధాలు పనిచేసేవి. కానీ ఇప్పుడు మేయర్, మున్సిపల్ ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికల వల్ల ఓటర్ల దృష్టి వార్డు సభ్యుల కంటే ప్రధాన పదవిపైనే ఎక్కువ కేంద్రీకృతమవుతుంది. నగరవ్యాప్తంగా అధికార పార్టీ వీచే గాలి , అభ్యర్థి ప్రాభవం ఆటోమేటిక్‌గా కింద ఉన్న వార్డు కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలపై కూడా ప్రభావం చూపుతుంది. మేయర్ అభ్యర్థికి గెలుపు అవకాశాలు లేవని భావిస్తే, అది కింది స్థాయి వార్డు అభ్యర్థుల ప్రచారంపై, అలాగే ఓటర్ల మూడ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ సమగ్ర ప్రభావం వల్లనే పలు పట్టణాల్లో వైసీపీకి చెందిన కింది స్థాయి క్యాడర్ వార్డు స్థాయి పోటీని కూడా తీవ్రంగా తీసుకోలేని నైరాశ్యంలోకి జారుకుంటోంది. ప్రత్యక్ష ఎన్నికల విధానంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ఎన్నికలు రావడం మంచిదేనని స్పందించారు. అయితే, పార్టీ క్షేత్రస్థాయి బలాబలాలు, నగర ప్రాంతాల్లో ఉండే ప్రతికూల వాతావరణం, అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎదురయ్యే వనరుల కొరతను లోతుగా విశ్లేషించకుండానే అధినేత ఆ ప్రకటన చేశారని పార్టీ సీనియర్ నేతలు మథనపడుతున్నారు. నాయకులకు కేవలం ఆదేశాలు ఇవ్వడమే తప్ప, ప్రతిపక్షంలో ఉన్న ఈ క్లిష్ట సమయంలో అభ్యర్థులకు అవసరమైన ఆర్థిక లేదా క్షేత్రస్థాయి రక్షణ బాధ్యతను పార్టీ కేంద్ర నాయకత్వం ప్రత్యక్షంగా తీసుకుంటుందనే స్పష్టమైన అభయాన్ని ఇవ్వలేకపోతున్నారు. అందుకే లోకల్ పోరును సీరియస్‌గా తీసుకోకుండా నామమాత్రంగా వైసీపీ క్యాడర్ పరిగణిస్తోంది.

# టీ20ల్లో శ్రీ చరణి సరికొత్త రికార్డు.. మళ్లీ టాప్-5లోకి స్మృతి మందాన!



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన మహిళల టీ20ఐ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి సంచలన రికార్డు సృష్టించింది. అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ కెరీర్‌లోనే అత్యధికంగా 817 రేటింగ్ పాయింట్లను సాధించి సరికొత్త చరిత్ర సృష్టించింది. దీంతో నవంబర్ 2018 నుంచి ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ మెగాన్ షట్ పేరు మీద ఉన్న 806 పాయింట్ల ఆల్-టైమ్ రికార్డును శ్రీ చరణి బ్రేక్ చేసేసింది. ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ విజయం సాధించడంలో శ్రీ చరణి కీలక పాత్ర పోషించింది. ఈ టోర్నీలో మొత్తం 12 వికెట్లు తీసిన ఆమె, శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 4/20తో అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇక ఆసియా క్రీడలలోనూ తన జోరును కొనసాగించిన చరణి.. జపాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో కేవలం 10 పరుగులే ఇచ్చి 4 వికెట్లు (4/10) పడగొట్టి కెరీర్ బెస్ట్ ఫిగర్స్ నమోదు చేసింది. అంతేకాకుండా శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక పోరులోనూ కీలకమైన 2 వికెట్లు తీసి టీమిండియాకు గోల్డ్ మెడల్ అందించడంలో ప్రధాన భూమిక పోషించింది. ఈ అద్భుతమైన ప్రదర్శనే ఆమెను ఐసీసీ చరిత్రలోనే అత్యధిక రేటింగ్ సాధించిన బౌలర్‌గా నిలబెట్టింది.

**టాప్-5లోకి దూసుకొచ్చిన స్మృతి, దీప్తి శర్మ:**

ఆసియా క్రీడల ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో 79 పరుగులు సాధించిన భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-5లోకి దూసుకొచ్చారు. అంతేకాకుండా ఆమె వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని పదిలపరుచుకున్నారు.

ఆసియా క్రీడల ఫైనల్‌లో మూడు వికెట్లు తీసిన ఆల్ రౌండర్ దీప్తి శర్మ 754 పాయింట్లతో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోగా, ఇంగ్లాండ్ ఆటగాడు సోఫీ ఎక్లెస్టన్ (723) మూడో స్థానంలో కొనసాగుతుంది.

# వర్షం దెబ్బకు నాలుగు క్వార్టర్ ఫైనల్స్ రద్దు.. సెమీస్ బెర్త్ ఫిక్స్: పాక్‌తో కాదు శ్రీలంకతోనే భారత్ ఢీ

**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 ఆసియా క్రీడలలో పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌ను వర్షం తీవ్రంగా దెబ్బతీసింది. నిరంతరం కురుస్తున్న వర్షాల కారణంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లన్నీ రద్దు కావడంతో, టోర్నమెంట్ రూల్స్ ప్రకారం సెమీఫైనల్స్ బెర్త్‌లు ఖరారయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమిండియా.. ఫైనల్ పోరుకు అర్హత సాధించేందుకు శ్రీలంకతో తలపడనుంది.




**వర్షం దెబ్బకు అన్నీ క్వార్టర్ ఫైనల్స్ రద్దు:**

నాగోయా, నిస్షిన్ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మెన్స్ క్రికెట్ నాకౌట్ దశ మ్యాచ్‌లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాకిస్థాన్ - హాంకాంగ్, భారత్ ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య జరగాల్సిన తొలి రెండు క్వార్టర్ ఫైనల్స్ వర్షంతో పూర్తిగా రద్దయ్యాయి. ఐసీసీ టీ20ఐ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న కారణంగా భారత్, పాకిస్థాన్‌లు నేరుగా సెమీస్‌లోకి ప్రవేశించాయి. అలాగే శ్రీలంక వర్సెస్ నేపాల్, బంగ్లాదేశ్ వర్సెస్ మలేషియా మ్యాచ్‌లు కూడా వర్షార్పణం కావడంతో, ర్యాంకింగ్ ఆధారంగా శ్రీలంక, బంగ్లాదేశ్ కూడా సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

**శ్రేయస్ కెప్టెన్సీలో బరిలోకి భారత్:**

స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు ఇంకా ఈ ఆసియా క్రీడల్లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ జట్టులో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ కూడా చోటు దక్కించుకోవడం విశేషం. ప్రధాన కోచ్ గౌతం గంభీర్ గైర్హాజరీలో నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ టోర్నీకి హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

**అక్టోబర్ 1న సెమీఫైనల్స్:**

వర్షం అంతరాయం తొలగిపోయి, వాతావరణం అనుకూలిస్తే అక్టోబర్ 1వ తేదీ (గురువారం)న రెండు హై-వోల్టేజ్ సెమీఫైనల్స్ జరగనున్నాయి.

మొదటి సెమీఫైనల్: పాకిస్థాన్ జం బంగ్లాదేశ్

రెండో సెమీఫైనల్: భారత్ జం శ్రీలంక (వేదిక: కొరోగీ స్పోర్ట్స్ పార్క్, నిస్షిన్)

# ట్రాక్‌పై దుమ్మురేపిన భారత అమ్మాయిలు.. 4x400 మీటర్ల రిలేలో స్వర్ణం



**హైదరాబాద్ పెన్ పవర్:** వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడలలో (ూంఖఅ +ుఎవం 2026) అథ్లెటిక్స్ విభాగంలో భారత్ ఎట్టకేలకు తన తొలి బంగారు పతకాన్ని సాధించింది. గత కొన్ని రోజులుగా రజత, కాంస్య పతకాలతో సరిపెట్టుకున్న టీమిండియా అథ్లెట్లు, ఈరోజు (సెప్టెంబర్ 29, మంగళవారం) జరిగిన మహిళల 4ఞ400 మీటర్ల రిలే ఫైనల్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశానికి చిరస్మరణీయ పసిడిని అందించారు.

**అదరగొట్టిన మహిళల జట్టు.. అథ్లెటిక్స్ లో స్వర్ణం:**

భారత మహిళల రిలే జట్టులో కీలక సభ్యులైన విత్య రామ్‌రాజ్, కిరణ్ పహల్, మచేత్తిర పూవమ్మ, ప్రాచి అద్భుతమైన సమన్వయంతో బరిలోకి దిగారు. హోరాహోరీగా సాగిన ఈ తుది పోరులో భారత క్వార్టెట్ కేవలం 3:29.69 సెకన్ల వ్యవధిలో గమ్యస్థానాన్ని చేరి మొదటి స్థానంలో నిలిచింది. చివరి ల్యాప్‌లో బహ్రెయిన్ (3:30.21), చైనా (3:31.02) జట్ల నుంచి తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, భారత రన్నర్లు ఏమాత్రం తడబడకుండా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. బహ్రెయిన్ రజతం, చైనా కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నాయి.

**చరిత్ర సృష్టించిన విత్య.. ఒకే గేమ్స్‌లో 3 పతకాలు:**

ఈ స్వర్ణ పతకం గెలుపుతో అథ్లెట్ విత్య రామ్‌రాజ్ తన అద్భుతమైన ఆసియా క్రీడల ప్రయాణాన్ని ముగించింది. ఈ క్రీడలలో ఆమెకు ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే మిక్స్‌డ్ 4ఞ400 మీటర్ల రిలేలో రజతం సాధించిన విత్య.. మహిళల 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష యొక్క 42 ఏళ్ల నాటి జాతీయ రికార్డును (54.75 సెకన్లు) బద్దలు కొట్టి మరీ కాంస్య పతకం గెలుచుకుంది. తాజాగా ఈ రిలే గోల్డ్‌తో ఆమె తన ఖాతాలో అరుదైన ట్రిపుల్ మెడల్స్ సాధించారు.



# దసరా బరిలో జైలర్ 2 & రణబాలి ప్రమోషనల్ స్ట్రాటజీ!



దసరా పండుగ అత్యంత ఆసక్తికరంగా మారబోతోంది. పండుగ వాతావరణంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న -జైలర్ 2-, విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న జంటగా తెరకెక్కుతోన్న -రణబాలి- చిత్రాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రెండు చిత్రాలు దసరా కానుకగా ఒక్క రోజు గ్యాప్ లోనే విడుదలవుతుండటంతో సన్నివేశం ఆసక్తికరంగా మారుతోంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న -జైలర్ 2- ( అక్టోబర్15) పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. మొదటి భాగంలో టైగర్ ముత్తువేల్ పాండ్యన్‌గా రజినీకాంత్ చూపించిన పవర్ ఫుల్ యాక్షన్ అండ్ మేనరిజమ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో సీక్వెల్‌లో రజినీకాంత్ పాత్ర ఎలా ఉండబోతోంది? యాక్షన్ ఎపిసోడ్స్ ఏ స్థాయిలో తెరకెక్కించారనే విషయంపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.మరోవైపు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నటిస్తోన్న -రణబాలి-( అక్టోబర్ 16) చిత్రం కూడా అదే రేంజ్‌లో అంచనాలను పెంచేస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా పీరియాడికల్ యాక్షన్ డ్రామా స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కొన్ని చీకటి అధ్యాయాలు, యదార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటోంది.అయితే ఈ రెండు చిత్రాల ప్రమోషన్స్ కోసం ఎంచుకున్న వినూత్న వ్యూహం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. రెండు చిత్రబృందాలు టీజర్లు, ట్రైలర్లతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీల ద్వారా ప్రమోషన్లు నిర్వహించే ఒకే రకమైన స్ట్రాటజీని ఫాలో అవుతున్నాయి. ఇప్పటికే -జైలర్ 2- టీమ్ -జైలర్ 2 అన్‌లాక్డ్- పేరుతో విడుదల చేసిన స్పెషల్ డాక్యుమెంటరీ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలవగా.. -రణబాలి- బృందం కూడా ఏకంగా నాలుగు ఎపిసోడ్ల భారీ మేకింగ్ డాక్యుమెంటరీ సిరీస్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది.సినిమా వెనుక ఉన్న కష్టం, టెక్నికల్ విలువలు, లొకేషన్లు , నటీనటుల శ్రమను డాక్యుమెంటరీ రూపంలో నేరుగా ప్రేక్షకులకు చూపించడం వల్ల సినిమాపై మరింత కనెక్టివిటీ, విశ్వసనీయత పెరుగుతాయని నిర్మాతలు భావిస్తు న్నారు. సాధారణ ప్రచార చిత్రాల కంటే ఇలాంటి బిహైండ్-ది-సీన్స్ డాక్యుమెంటరీలు జాతీయ స్థాయిలో సినీ ప్రేమికులను ఆకట్టుకుంటూ సినిమా మేకింగ్ ప్రమాణాలను ఉన్నత స్థాయిలో నిలబెడుతున్నాయి.రెండు సినిమాల బాట ఒకటే కావడంతో సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పవర్ ఫుల్ మాస్ యాక్షన్ అంశాలతో -జైలర్ 2- వస్తుంటే? వైవిధ్యమైన చారిత్రక కథాంశంతో -రణబాలి- రేసులో ఉంది. మరి దసరా బరిలో ఎవరు విజేత అవుతారు? అన్నది చూడాలి.

అయితే ఈ రెండు సినిమాల ప్రభావం చాలా సినిమాలపై పడుతుంది. పండగ నేపథ్యంలో చాలా సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. దీంతో థియేటర్ల పరంగా ఇబ్బంది ఎదురవుతుంది.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965